

నేడు తొలి కార్తీక సోమవారం

కార్తీక మాసంలో సోమవారానికి ప్రాముఖ్యత ఉంటుంది. సోమవారం మహాశివుడికి ప్రీతికరమైన రోజు కావడం పైగా ఈ మాసంలో తొలి సోమవా రం కావడంతో సోమవారం గోదావరి స్నానాలకు భారీగా భక్తులు వస్తారు. ఇందుకు తగ్గ ఏర్పాట్లను అధికారులు చేస్తున్నారు.తెల్లవారుజామున 2గంటల నుంచి భక్తులు తాకిడి మొదలవుతుందని సమాచారం. గోదావరి ఘాట్ల వద్ద ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేశారు. ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని నియమించారు. ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు గోదావరి మాతకు మహా నీరాజనం

10 వేల మంది వీక్షించే విధంగా కొవ్వూరులో ఏర్పాట్లు

కొవ్వూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో అఖండ గోదావరి నదికి అందించే కార్తీక హారతికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు క్షేత్రంలోని ప్రధాన స్నాన ఘట్టంలో నదిలో పం టు ఏర్పాటు చేశారు. ఆ పంటుపై తిరుమల తిరుపతి నుంచి తీసుకువస్తున్న ఉత్సవమూర్తులను ఉంచుతారు. అనంత రం కార్తీకమాసం సోమవారం పురస్కరిం చుకుని అఖండ గోదావరి మాతకు (మహా నీరాజనం) హారతి అందజేస్తారు.సోమవారం సాయంత్రం 5-30 గంటల నుంచి 7-30 గంటల వరకు తితిదే నుంచి తీసుకువచ్చిన శ్రీ భూ సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు విశేష పూజలు, హరి నామ సంకీర్తనల అనంతరం గోదారమ్మకు వివిధ రకాల హారతులను అందించి మహా నీరాజనం సమర్పించడం జరుగుతుందని దాస సాహిత్య ప్రాజెక్టు కొవ్వూరు కోఆర్డినేటర్ రోహిణికుమార్ తెలిపారు.ఈ కార్యక్రమాన్ని సుమారు 10 వేల మంది భక్తులు వీక్షించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో గోదావరిపై ఏర్పాటు చేసిన పంటు

భక్తజన గోదావరి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 3 , (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం, కొవ్వూరులోని గోదావరి స్నాన ఘట్టాలు కార్తీక శోభతో అలరారుతున్నాయి. ఆదివారం వేకువజామున 3 గంటల నుంచి భక్తులు కోటిలింగాలరేవు, చింతాలమ్మఘాట్, పద్మావతి ఘాట్, పుష్కరాల రేవు, టీటీడీ ఘాట్, మార్కండేయ ఘాట్, దోబీఘాట్ , సరస్వతి ఘాట్, గౌతమి ఘాట్, కొవ్వూరు గోష్పాదక్షేత్రం తదితర ఘాట్లలో భక్తులు గోదావరి స్నానాలు చేశారు. ఆయా రేవుల్లో కొబ్బరి డిప్పలు, ఆరటీ డొప్పల్లో కార్తీక దీపాలను విడిచిపెట్టారు. తెల్లవారుజాము నుంచి ఉదయం 7:30 గంటల వరకు కార్తీక దీపా లు వదిలారు. అనంతరం సమీపంలోని దేవాయాలలకు వెళ్లి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. దీంతో ఉదయం నుంచి గోదావరి ఘాట్లు భక్తజనంతో కిటకిటలాడాయి. ఆదివారం కావడంతో ఎక్కడెక్కడి నుంచో భక్తజనం తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. ఆదివారమే ఇలా ఉంటే సోమవారం మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.



పుష్కరఘాట్‌లో స్నానమాచరిస్తున్న భక్తజనం

రఘుదేవపురంలో నిధులు దుర్వినియోగం

రూ 1.18 కోట్లు తినేశారు..
అధికారుల విచారణ బయటకు
ఆరుగురికి షోకాజ్ నోటీసులు

సీతానగరం,నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రఘుదేవపురం పంచాయతీలో రూ 1.18 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్టు అధికారులు నిర్ధారించారు. రఘుదేవపురం పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై గతంలో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టి అధికారులు పంచాయతీ రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ ఇందుగుమిల్లి చంద్రలీల రూ.38,89,799 , పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసిన కేవీఎస్ఎస్ రాజశేఖర్ రూ. 15,83, 271, జీఎస్ఎస్ సాయి రూ 15,73,835, బి.అప్పారావు రూ.15,63,221, బిల్ కలెక్టర్ వై.అర్జునుడు 17,26,053 దుర్వినియోగం చేసినట్టు గుర్తించి జిల్లా కలెక్టర్ ప్రశాంతి షోకాజ్ నోటీసులు జారీచేశారు.పార్ట్‌టైం అటెండర్‌గా పనిచేస్తున్న జి లాల్ కుమార్ ఖాతాలో 15,02,000 నగదు గల్లంతు కావడంతో అతనికి కూడా షోకాజ్ నోటీస్ ఇచ్చారు. ఈ షోకాజ్ నోటీసులపై సంజాయషీ కోరారు. ఈ విషయమై ఈవోపీఆర్‌డీ మూర్తిని వివరణ కోరగా షోకాజ్ నోటీసులు రావడం వాస్తవమని వారిని సస్పెండ్ చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. వీరిలో అప్పటి కార్యదర్శి సాయి కాటవరం వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ మేరకు రఘుదేవపురం పంచాయతీ ఆవరణలో ఆదివారం కూటమి నాయకులు విలేకరులతో మాట్లాడారు. విచారణ సమయంలో ఎంపీపీ జ్యోత్స్న, షాడో సర్పంచ్ (అనధికార సర్పంచ్) గెద్దాడ త్రిమూర్తులు ఎటువంటి అవినీతి జరగలేదని, అవినీతి జరిగినట్టు నిరూపిస్తే మా ఆస్తులు మొత్తం రాసిస్తామని సవాల్ విసిరారని అన్నారు. మాట నిలబెట్టుకుని వారి ఆస్తులు పంచాయతీకి రాసివ్వాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో కాంద్రు శ్రీనివాసరావు సూరి నాగు,సుబ్బారావు,రామారావు,దొడ్డ శ్రీను, మునుకోటి శ్రీను పాల్గొన్నారు.

కమిషనరేట్‌కు హుకుంపేట
కార్యదర్శి సరెండర్

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం రూరల్ మండలం హుక్కుంపేట గ్రామ పంచాయితీ కార్యదర్శిగా ఇటీవల జాయిన్ అయిన రాజశేఖర్‌ను పీఆర్ కమిషనరేట్‌కు సరండర్ చేస్తూ కలెక్టర్ ప్రశాంతి ఉత్తర్వులు జారీ చేశారు. రాజశేఖర్ గతంలో సీతానగరం మండలం రఘుదేవపురం పంచాయతీలో పనిచేసిన కాలంలో నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని ఫిర్యాదుల రావడంతో విచారణ జరిపారు. దీనిపై కలెక్టర్‌కు వచ్చిన నివేదిక ఆధారంగా రాజశేఖర్‌ను పీఆర్ కమిషనరేట్‌కు సరెండర్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలిచ్చారు. అదేవిధంగా ఆ తర్వాత కాలంలో పనిచేస్తూ దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలు కూడా వాస్తవాలని తెలడంతో మరో ముగ్గురిపై చర్యలు తీసుకున్నట్టు తెలిసింది.



కలపరు.. వదలరు!

13 ఏళ్లుగా వీడని విలీన వేదన

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 3 (ఆం ధ్రజ్యోతి): 13 ఏళ్లుగా 'ప్రత్యేక' పాలన.. నేటికీ పంచాయతీల సంగతి అతీగతీ లేదు.. ప్రత్యేకాధి కారులు పట్టించుకోవడం లేదు..పాలకవర్గాలు లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కొన్ని గ్రామాల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. దీనికి కారణం ఆయా గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు జరగక ప్రత్యేకాధికారుల పాలనలో ఉండిపోవడమే. పంచాయతీలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు పొందలేకపోతున్నారు. గ్రామాల్లో ఏ పనులు చేయాలన్నా పన్నులే ఆధారం. దీంతో ఆయా గ్రామాల్లో అభివృద్ధి పూర్తిస్థాయిలో కుంటుపడింది.

- 30 గ్రామాల్లో పాలన పడక
- 2011 నుంచి ఎన్నికల్లేవ్
- ప్రత్యేక పాలనతో ఇబ్బందులే
- అందని ఆర్థిక నిధులు
- పన్నులపైనే ఆధారం
- కుంటుపడిన అభివృద్ధి
- కూటమి రాకతో ఆశలు

30 పంచాయతీల్లో ఎన్నికల్లేవ్..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 1103 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో పాలకుల్లేని పంచాయతీలు 30 ఉన్నాయి. ఆయా పంచాయతీలు 13 ఏళ్లుగా ప్రత్యేక పాలనలోనే ఉన్నాయి. 2006 ఉమ్మడి రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి.ఆ తర్వాత 2011లో ఎన్నికలు జరగాలి.ఆ 30 పంచాయతీల్లో మాత్రం ఎన్నికలు జరగలేదు. 2011 నుంచి ఆ పంచాయతీల్లో సర్పంచ్, పాలకవర్గాలు లేవు. దీంతో ఈ పంచాయతీల్లో ఇప్పటికీ ప్రత్యేకాధికారుల పాలనలోనే ఉన్నాయి. ప్రభుత్వం ఈ పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాలను ఏర్పాటు చేయాలన్న ఆలోచన చేయడంలేదు. ఆయా పంచాయతీల్లో ఎన్నికలపై కొనసాగుతున్న సాంకేతిక, న్యాయపరమైన చిక్కులను తొలగించడం లేదు. దీంతో ఈ గ్రామాల్లో పాలన పడకేసింది. వివిధ శాఖల జిల్లా, మండల అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. స్పెషల్ ఆఫీసర్లు గ్రామాల్లో పర్యటించి సమస్యలను పరిష్కరించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎన్నికలకు దూరమైన పంచాయతీలివే..

కాకినాడ జిల్లా : కాకినాడ రూరల్ మండల పరిధిలో ఆరు పంచాయతీలు. చీడిగ, రమణయ్యపేట, వలసపాకల, వాకలపూడి, ఇంద్రపాలెం, తూరంగి. తుని మండల పరిధిలో రేకవానిపాలెం, ఎస్. అన్నవరం, తాళ్లూరు, కుమ్మరిలోవ ఉన్నాయి.
తూర్పు గోదావరి జిల్లా : రాజమహేంద్రవరం రూరల్ పరిధిలో ధవళేశ్వరం, బొమ్మూరు, పిడింగొయ్యి, కోలమూరు, శాటిలైట్ సిటీ, కాతేరు, తొర్రేడు, హుకుంపేట, రాజవోలు, వెంకటనగరం.. రాజానగరం మండలంలో నామవరం, వెలుగుబంద, చక్రద్వారబంధం, పాలచర్ల, దివాన్‌చెరువు. కడియం మండలంలో వేమగిరి, కోరుకొండ మండలంలో గాడాల, నిడిగట్ల, మధురపూడి, బూరుగుపూడి పంచాయతీలు ఉన్నాయి.

స్వార్థ రాజకీయాలకు బలి..

మునిసిపాలిటీ, మునిసిపల్ కార్పొరేషన్లలో 30 పంచాయతీలను విలీనం చేయాలని స్థానిక ప్రజలు కోరుకుంటుంటే విలీనం చేస్తే తమ రాజకీయ భవిష్యత్తు ఏంటని ప్రజాప్రతినిధులు, నాయకులు వారి స్వార్థ రాజకీయాల కోసం విలీన ప్రక్రియను అడ్డుకుంటున్నారని విమర్శలున్నాయి. పేరుకే ప్రత్యేకాధికారులైనా అధికార పార్టీ నేతలు, స్థానిక ఎమ్మెల్యే కనుసన్నల్లోనే ఈ గ్రామాల్లో పాలన సాగుతోంది. దీంతో గ్రామాల్లో పాలన అస్తవ్యస్తంగా ఉంది. పాలకవర్గాలు లేకపోవడంతో గ్రామ పంచాయతీలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులకు దూరమవుతున్నాయి. అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి. ప్రజలు చెల్లిస్తున్న పన్నులపైనే అభివృద్ధి పనులు ఆధారపడి ఉన్నాయి. ఈ పంచాయతీల్లో ఎన్నికల సమస్యకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ పరిష్కారం చూపిస్తారని ఆయా గ్రామాల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా తమ గ్రామ పంచాయతీల్లో సాంకేతిక సమస్యలను పరిష్కరించి ఎన్నికలు జరిగేలా చూడాలని వారు కోరుతున్నారు.

'గ్రేటర్' రాజమహేంద్రి ఎప్పుడో

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గ్రేటర్ రాజమహేంద్రవరం కలగా మారింది. పరిసర గ్రామాల విలీన ప్రక్రియపై అయోమయం నెలకొంది. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థలో రాజమహేంద్రవరం రూరల్, కోరుకొండ, రాజానగరం మండలంలోని మొత్తం 22 గ్రామాలతో గ్రేటర్ రాజమహేంద్రవరం చేయాలని 2019కి ముందు తెలుగుదేశం ప్రభుత్వం ఆలోచన చేసింది. గ్రామాలను విలీనం చేసి 54 డివిజన్లతో గ్రేటర్ మునిసిపల్ కార్పొరేషన్ మాస్టర్ ప్లాన్ కూడా సిద్ధం చేసింది. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో విలీన ప్రక్రియ మూలనపడింది. కేవలం కొన్ని గ్రామాలనే విలీనం చేసి డివిజన్ల సంఖ్య 54 నుంచి 52కు తగ్గించే ప్రయత్నం చేశారు. అదీ సాగలేదు. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ ఎన్నికలు 2015లో తెలుగుదేశం పార్టీ హయాంలో జరిగాయి. మేయర్‌గా పంతం రజనీ శేషసాయి తెలుగుదేశం పార్టీ తరపున ఎన్నికైన సంగతి తెలిసిందే. ఆ పాలకవర్గం 2019 జూలై 2న ముగిసింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ గెలిచినా ఎన్నికల ఊసే ఎత్తలేదు. ప్రస్తుతం కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికలు జరిపిస్తారనే ప్రచారం జరుగుతోంది. విలీనం గ్రామాలతో కలిపి ఎన్నికలు జరపాలని కొందరు, పాత 50 డివిజన్లతోనే ఎన్నికలు జరిపితే బావుంటుందని కొందరు ఆలోచిస్తున్నట్టు సమాచారం. కానీ ప్రజలు మాత్రం గతంలో ప్రతిపాదించిన 22 గ్రామాలను కలిపి ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్నారు. అలా జరిగితేనే వచ్చే పుష్కరాల నాటికి గ్రేటర్ రాజమహేంద్రవరం కల నెరవేరుతుందనే చర్చ మొదలైంది. ప్రస్తుతం తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ గ్రేటర్ కలలు కంటున్నారు. కొద్దిరోజుల కిందట సీఎం చంద్రబాబు వద్ద పలువురు ఎమ్మెల్యేలు గ్రామాల విలీనం, ఎన్నికల గురించి ప్రస్తావించినట్టు సమాచారం.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

రాజమహేంద్రవరం రూరల్ నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు డివిజన్, మండల స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమం సోమవారం యథాతథంగా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ ,ఇతర జిల్లా అధికారులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఫిర్యాదులను కలెక్టరేట్‌లో ప్రజల నుంచి స్వీకరిస్తారని తెలిపారు. రెవెన్యూ, మునిసిపల్ ,మండల స్థాయి అధికారులు అందరూ మండల ప్రధాన కేంద్రంలో ఒకే చోట హాజరై అర్జీలు స్వీకరించాలని ఆదేశించారు.



కరుణించమ్మా.. కోటసత్తెమ్మ

నిడదవోలు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో ఆదివారం అమ్మ వారికి విశేష పూజలు చేశారు.అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి క్షీర నివేదన మహా నివేదన చేశారు. తూర్పు గోదావరి జిల్లా నుంచి మాత్రమే కాక రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



మస్తర్ల మాయాజాలం!

గ్రామంలో లేకున్నా పనులకు వచ్చినట్టు మస్తర్లు

- ఉపాధిలో భారీ అవినీతి
- దొంగ మస్తర్లతో మస్కా
- కోట్లాది రూపాయలు స్వాహా
- అక్రమార్జనలో ఫీల్డ్ అసిస్టెంట్లు
- ముక్కినాడలో ఇదీ తీరు

రాజానగరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం కొంతమంది అవినీతి పరులకు వరంగా మారింది.గ్రామాంతరం వెళ్లిన వారితో పాటుగా, గ్రామంలో ఉంటూ అసలు ఉపాధి హామీ పనులకు రాని వారికి సైతం జాబ్ కార్డులు సృష్టించి పనుల్లోకి వస్తున్నట్లుగా మస్తర్లు వేస్తూ, కోట్లాది రూపాయల ప్రభుత్వ నిధులను స్వాహా చేస్తున్నారు. దొంగ మస్తర్లతో అధికారులను మస్కా కొడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమార్జనకు పాల్పడుతున్నారు. దీంతో ఉపాధి హామీ పథకంలో పనులు చేయకుండా వేతనాలు తీసుకునే కూలీల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతోంది. రాజానగరం మండలం ముక్కినాడ గ్రామంలో సాగుతున్న ఉపాధిహామీ పనులే ఇందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. గ్రామంలో గత వైసీపీ ప్రభుత్వ పాలన నాటి నుంచి నేటి వరకు కోట్లాది రూపాయలు వెచ్చించి ఉపాధి పనులు చేపట్టినట్లుగా రికార్డులను బట్టి తెలుస్తోంది. కానీ వాస్తవంగా పరిశీలిస్తే వీరిలో అధికశాతం పనిలోకి రానివారికి మస్తర్లు వేస్తూ.. వేతనాలు డ్రా చేసి, వారికి కొంత ముట్టజెప్పి, మిగిలిన సొమ్మును ఫీల్డ్ అసిస్టెంట్ కాజేస్తున్నట్టు సమాచారం. రాజమహేంద్రవరపు సోమరాజు, భార్య సత్యవేణి జాబ్ కార్డు నెంబర్ (ఏపీ-04-028-018-012/010024) గత కొన్నేళ్లుగా రాజమహేంద్రవరంలో నివసిస్తూ, ఒక అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. వీరు గత ప్రభుత్వ హయాం నుంచి ఇప్పటి వరకు ముక్కినాడలో చేపట్టే ఉపాధి పనులకు వెళుతున్నట్టుగా మస్తర్లు నమోదు చేసి డబ్బులు కాజేస్తున్నారు. అలాగే సోడసాని నాగరాజు జాబ్ కార్డు నెంబర్ (ఏపీ-04-028-018-012/010492); ఉండమట్ల రాజు జాబ్ కార్డు నెం.(ఏపీ/010305); కవల శివరామ్ జాబ్ కార్డు నెం.(ఏపీ/010097); చిర్ల రామకృష్ణారెడ్డి జాబ్ కార్డు నెం.(ఏపీ/010497) అనే వారు ఇంత వరకు అసలు ఉపాధి పనిలోకి వెళ్లిన దాఖలాలు లేవు.. అయినా వీరంతా ఉపాధి పనులకు వస్తున్నట్టుగా మస్తర్లు నమోదు చేసి వేతనాలు డ్రా చేస్తున్నట్టుగా ఆధారాలు రుజువు చేస్తున్నాయి. ఈ విధంగా ఎంతో మందికి దొంగ మస్తర్లు చూపిస్తూ, కోట్లాది రూపాయల ప్రభుత్వ నిధులు దోపిడీకు గురవుతున్నట్లు తెలుస్తోంది. ఈ విధంగా నరేంద్రపురం గ్రామంలో కూడా కోట్లాది రూపాయల ఉపాధి నిధులు పక్కదారి పట్టాయని, విచారణ జరిపించాలని కోరుతూ ఇటీవల గ్రామ సభలో గ్రామస్తులు అధికారులకు మొరపెట్టుకున్నారు. అయితే నేటికి అధికారులు ఏవిధమైన విచారణ చేపట్టలేదు. కొంతమంది రాజకీయ నాయకుల పలుకుబడిని ఉపయోగించి ఈ అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నారని సమాచారం. ఉపాధి హామీ పనుల్లో చోటు చేసుకుంటున్న అవినీతి అక్రమాలను వెలికితీయాలని ముక్కినాడ వాసులు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.



ముక్కామల సభలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్.. (ఇన్‌సెట్‌లో) రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న దుర్గేష్, శేషారావు..అనపర్తిలో సాగుతున్న పనులు

గుంతల్లేని రహదారులే లక్ష్యం

ముక్కామలలో రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించిన మంత్రి దుర్గేష్

పెరవలి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రూ.826 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా రహదారుల మరమ్మతులు చేసేందుకు దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించినట్టు మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పెరవలి మండలం ముక్కామలలో గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వం కొత్త రోడ్లు వేయడం మాట ఎలా ఉన్నా ఉన్న రహ దారులను బాగు చేయాలన్న ఆలోచన కూడా చేయలేదన్నారు.గత ఐదేళ్లలో రాష్ట్రంలో రోడ్లన్నీ నరకానికి చిరునామాగా మారాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎన్టీఆర్ పింఛన్లు క్రమం తప్ప కుండా ఒకటో తేదీన లబ్ధిదారులకు అం దజేయడం జరుగుతుందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏపీని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ గుంతలు లేని రహదారులుగా రోడ్లను మార్చడానికి ప్రణాళిక రూపొందించామన్నారు. నిడదవోలు నియోజకవర్గంలో సుమారు రూ.79 లక్షలతో పనులు చేపడుతున్నామన్నారు. రాబోయే సంక్రాంతి నాటికి గుంతలు లేని రహదారులను రూపొందించడమే లక్ష్యంగా పనులు చేస్తున్నారని తెలిపారు.మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ గుంతలు లేని రహదారుల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఇంజనీర్ ఎస్‌బీవీ రెడ్డి, డీఈ వెంకట రమణ, ఏఈ శ్రీనివాస్, నాయకులు భూపతిరాజు రవి వర్మ, సర్పంచ్ కేతా త్రిమూర్తులు,వైస్ సర్పంచ్ వీరేష్ బాబు, అతికాల రామకృష్ణమ్మ, పిప్పర రవి, వేండ్ర వెంకట రామమూర్తి, రేలంగి రాజేష్, నల్ల సురేంద్ర, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రాణాలు తీసిన నిద్రమత్తు

రోడ్డు ప్రమాదంలో అక్కాచెల్లెళ్ల మృతి

7



సైకిళ్లపై శబరిమలైకు..

దేవరపల్లి నుంచి ఇద్దరు స్వాముల యాత్ర

దేవరపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టుదల ఉంటే కానిది లేదు.. లక్ష్యం ఉంటే సాధించలేదని లేదు.. దీక్షగా ఉంటే ఏదైనా చేయవచ్చు.. ఎంత దూరమైనా వెళ్లవచ్చు.. ఇప్పటి వరకూ భవానీ మాలధారులు.. వెంకటేశ్వర స్వామి మాలధారులను చూశాం.. భక్తితో దీక్షగా నడుచు కుంటూ దర్శనం నిమిత్తం బయలుదేరి వెళుతుంటారు.. చూసేవాళ్లకు ఎందుకిలా అనిపించినా..భక్తిలో ఉన్న పవర్ అది..స్వామిని చూడాలి.. భక్తితో మొక్కాలి అదే ఆశ.. అందుకోసం ఎంత శ్రమ అయినా పడతారు.. లక్ష్యం చేరుకుంటారు.. ప్రస్తుతం స్వాములు ఆ దీక్షను ఆచరిస్తున్నారు.. ఎక్కడో 1800 కిలోమీటర్ల దూరంలో ఉన్న శబరిమలై సైకిళ్లపై వెళుతున్నారు.. గతంలో దివాన్‌చెరువు నుంచి సైకిళ్లపై నలుగురు శబరిమలైకు బయలుదేరి వెళ్లగా తాజాగా ఆదివారం దేవరపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు అయ్యప్ప మాల ధారులు కామిశెట్టి వెంకటరమణ, చింతాడ డేవిడ్ శబరిమలైకు సైకిళ్లపై బయలుదేరారు. సైకిళ్లపై వస్తామని స్వామిని మొక్కుకోవడంతో యాత్రకు బయలుదేరినట్టు తెలిపారు. సుమారు 20 రోజులు పడుతుందని తెలిపారు. సైకిళ్లపై శబరి మలై యాత్రకు బయలుదేరిన స్వాము లకు గ్రామస్తులు హారుతులిచ్చి... ఏ కష్టం లేకుండా క్షేమంగా తిరిగిరావాలని ఘనంగా వీడ్కోలు పలికారు..



డ్రోన్ల వ్యవసాయం!

వ్యవసాయ రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. పాత పద్ధతులను పక్కకు పెట్టి ఆధునిక వ్యవసాయం వైపు అడుగులు వేస్తోంది. సాం కేతిక పరిజ్ఞానంతో శాస్త్రవేత్తలు ఇప్పటికే పలు ప్రయోగాలు చేస్తున్నారు. వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు డ్రోన్ల వినియోగంపై దృష్టిసారించి పొలాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం అమరావతిలో డ్రోన్ల ఎగ్జిబిషన్ నిర్వహించింది. వ్యవసాయంలో డ్రోన్లు రంగ ప్రవేశం పూర్తిస్థాయిలోకి వస్తే కూలీల బెడద తగ్గిపోతుందని,మందుల వృథాను అరికట్టవచ్చని వ్యవసాయాధికారులు అభిప్రాయ పడుతున్నారు. రైతులకు వ్యవసాయానికి డ్రోన్‌లు సహకారమందిస్తున్నాయి..

6 గంటల్లో 30 ఎకరాలకు పిచికారీ

- మారుతున్న అగ్రి..కల్చరల్!!
- ఆధునికత వైపు అడుగులు
- సాగులో నూతన ఒరవడి
- సస్యరక్షణకు డ్రోన్లు
- పెరుగుతున్న వినియోగం
- ఒక్క క్లిక్‌తో పంటకు రక్షణ
- కూటమి ప్రభుత్వ సహకారం
- డ్రోన్ ఆపరేటింగ్‌పై శిక్షణ

సామర్లకోట/శంఖవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో సస్యరక్షణ ఒక ప్రధాన ఘట్టం. ఇందులో కూలీల ఖర్చు భారీగా ఉంటుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనేక ప్రత్యేకతలు ఉండడం వల్ల రైతులు వ్యవసాయంలో ఇబ్బందుల్లో ఉన్నారు. సస్యరక్షణకు భారీగా ఖర్చు చేసి పెట్టుబడుల భారం కింద నలిగిపోతున్నారు. మరో వైపు కూలీల కొరత వెన్నాడుతోంది. పొలం పనులు చేసే కూలీలు రావడమే గగనంగా మారింది. దీనికి పరిష్కారంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు డ్రోన్లు వినియోగించేందుకు పరిశోధనలు చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర వ్యవసాయాధికారులతో ఇప్పటికే సమాలోచనలు చేపట్టారు. రానున్న ఖరీఫ్ సీజన్ నాటికి రైతులకు డ్రోన్ల వినియోగంపై పూర్తి పట్టు సాధించే దిశలో కూటమి ప్రభుత్వం అడుగులు ముందుకేస్తోంది. కొత్త వంగడాల రూపకల్పనలో, కొత్త వ్యవసాయ పనిముట్ల తయారీలో పేరుగాంచిన సాంకేతిక నిపుణుల సలహాలు, సూచనలు తీసుకుని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో మమేకమవుతూ రాష్ట్రీయ కృషి విజ్ఞాన యోజన పథకం కింద తక్కువ ఖర్చుతో డ్రోన్లను వినియోగించి తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలోని పంటలకు క్రిమి సంహారక మందులు పిచికారీ చేసేందుకు ప్రయోగాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ శాస్త్రవేత్తల నేతృత్వంలో కీటక విభాగం సీనియర్ శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పలు ప్రయోగాలు చేస్తున్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల వ్యవసాయాధికారులు అధ్యయనం చేస్తున్నారు.

తక్కువ ఖర్చు..సమయం ఆదా...

డ్రోన్ల టెక్నాలజీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే వ్యవసాయ క్షేత్రాల్లో కూలీల కొరతను అధిగమించి సమయాన్ని ఆదా చేసుకోవచ్చు. ఎకరాకు పురుగుల మందు పిచికారీ చేయడానికి రూ.900 నుంచి రూ.1200 వరకూ ఖర్చవుతుంది. అదే డ్రోనుతో అయితే ఎకరాకు రూ.500 అద్దెగా తీసుకుంటారు. డ్రోన్ వినియోగంతో ఏ సమయంలోనైనా, ఏ పంటకైనా సులభంగా పిచికారీ చేయవచ్చు. తక్కువ ఖర్చుతో అంటే ఒక కూలీకి ఇచ్చే రూ.400తో ఒక ఎకరానికి కేవలం 10 నిమిషాల్లో పిచికారీ పూర్తి చేయవచ్చు. డ్రోన్లతో అన్ని రకాల పురుగు, కలుపు మందులు, ఆర్గానిక్ ద్రావణాలు, నీటిలో కరిగే ఎరువులను పిచికారీ చేయవచ్చు. కేవలం 6 గంటల్లో 30 ఎకరాల పంటలకు పిచికారీ చేయవచ్చని శాస్త్రవేత్తల పరిశోధనల్లో వెల్లడైందని వ్యవసాయ ఉన్నతాధికారులు తెలియజేస్తున్నారు. సాధారణంగా ఎకరా పొలానికి పురుగు మందులు పిచికారీ చేయాలంటే 200 లీటర్ల నీరు అవసరం అవుతుంది. డ్రోన్ ద్వారా కేవలం 10 నుంచి 14 లీటర్ల నీరు మాత్రమే సరిపోతుంది. ఏ పంట మీద అయినా సరే 2-3 అడుగుల ఎత్తులో పొలమంతా సమానంగా పిచికారీ చేయడం డ్రోన్‌లతోనే సాధ్యమని వెల్లడైంది. పిచికారీలో 95 శాతం నీటిని, 95 శాతం సమయాన్ని, 25-40 శాతం మందు ద్రావణాన్ని ఆదా చేస్తూ తద్వారా పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవచ్చని రుజువైంది. మందు మోతాదు 4వ వంతు తగ్గడం వల్ల పర్యావరణానికి కలిగే కాలుష్యాన్ని నివారించవచ్చు.వరి పంటలో సుడిదోమ లాంటి మొండి పురుగులను డ్రోన్ పిచికారీ ద్వారా సమర్థవంతంగా నివారించవచ్చు. పురుగు మం దులు వాడకం ద్వారా రైతుల్లో వచ్చే అనారోగ్య సమస్యలు, దుష్ప్రభావాల నుంచి తప్పించవచ్చు.

పనిచేస్తుందిలా..

జీపీఎస్, ఆటో పైలెట్ సహాయంతో రిమోట్ ద్వారా లేదా ఎల్‌సీడీ మొబైల్‌లో అగ్రిమీట్, అగ్రి అసిస్టెంట్ యాప్ ద్వారా ముందుగా పొలంపైన సెట్ చేసిన ఎత్తులో నిర్దిష్టమైన దిశలో పిచికారీ చేసేలా డ్రోన్‌కు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడి స్తారు. ప్రస్తుతం మార్కెట్‌లో స్థాయిని బట్టి ఒక డ్రోన్ ధర రూ.3 లక్షల నుంచి రూ.12 లక్షల వర కూ అందుబాటులో ఉన్నాయి. 12-16 వేల ఎంఏహెచ్ లిథియం పాలిమార్ బ్యాటరీతో 10 లీటర్ల డ్రమ్ము, ఒక జత బ్యాటరీస్‌తో ఒక ఎకరానికి కేవలం 10 నిమిషాల్లో పిచికారీ పూర్తి చేయవ చ్చు. సిగ్నల్ పోయినా, మందు అయిపో యినా, బ్యాటరీ తగ్గిపోయినా, పిచికారీ పూర్తయినా, డ్రోన్ మొదట ఉన్న చోటికే తిరిగి వస్తుంది. డ్రోన్ ద్వారా పిచికారీ పూర్తి చేసినదీ, ఇంకా చేయాల్సిందీ, చేస్తున్న ప్రదేశాన్ని మొబైల్ యాప్‌లో ఎరుపు, పసుపు, ఆకుపచ్చ రంగుల్లో చూడవచ్చు. దీన్ని సులభంగా వినియోగించడానికి వీలుగా ఒక పైలెట్(ఆపరేట్ చేయడానికి ల్యాండింగ్, డ్రోన్ తప్పిపోకుండా శాస్త్రీయ శిక్షణ పొందిన వ్యక్తి) రీచార్జి చేస్తూ, బ్యాటరీలు మార్చడానికి ఒక వ్యక్తి, మ్యాపింగ్ చేసేందుకు ఒక వ్యక్తి అవసరం ఉంటుంది. దీన్ని ఉపయోగించే వ్యక్తికి ప్రభుత్వ క్లియరెన్సుతో పాటు డీజీసీఏ వారి నుంచి అనుమతి పత్రం తప్పనిసరి.

యువతకు శిక్షణ

డ్రోన్ల వినియోగంపై యువతకు రాష్ట్రప్రభు త్వం శిక్షణ ఇస్తోంది. వ్యవసాయశాఖ ద్వారా ఎంపికైన యువతకు గుంటూరు విశ్వవిద్యాలయంలో డ్రోన్ల పైలట్‌ల శిక్షణ ఇస్తుంది. డ్రోన్ వినియోగం ఏ పంటకు ఎలా ఎరువులు, పురుగుల మందులు పిచికారీ చేయాలి, డ్రోన్ విడిభాగాలను ఎలా అమర్చాలి అనేదానిపై పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పిస్తోంది. శిక్షణ తీసుకున్న యువతకు సబ్సిడీలో డ్రోన్లు అందిం చేందకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుంది.



డ్రోన్ల వినియోగం పెరిగింది



సాంకేతికత పెరగడంతో డ్రోన్ కెమెరాలను వ్యవసాయానికి వినియోగిస్తున్నారు. తాము ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు శిక్షణ పొందుతున్నాం. ప్రస్తుతం ప్రతి దాంట్లో డ్రోన్ల వినియోగం పెరిగింది. ఇది ఫొటోగ్రాఫర్లకు శుభపరిణామం.

- రాము సూరిబాబు, డ్రోన్ కెమెరామెన్

రైతుకు ఆదా అవుతుంది



వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం మంచి ఫలితాలు ఇస్తుంది. దీంతో రైతులకు కూలీల బెడద తగ్గుతుంది. సమయం, సొమ్ములు ఆదా అవుతాయి. ప్రభుత్వం కూడా డ్రోన్‌ల వినియోగం వ్యవసాయంలో పూర్తిస్థాయిలో ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటుంది.

- రత్నప్రశాంతి, ఏడీఏ, కాకినాడ

వ్యవసాయానికి పూర్వవైభవం



వ్యవసాయంలో పూర్వవైభవానికి డ్రోన్‌లు ఉపయోగపడతాయి. పంటలపై ఎరువులు, పురుగుమందులు చల్లేందుకు హైబ్రిడ్ డ్రోన్‌లు ఉపయోగపడుతున్నాయి. ఆరు లీటర్ల పెట్రోల్‌తో 16 లీటర్ల పురుగుమందు పిచికారీ చేస్తుండడం విశేషం. - జీవీ.సత్యనారాయణ, రైతు వెంకటకృష్ణరాయపురం, సామర్లకోట





అయ్యప్ప పడిపూజకు ఏర్పాటు చేసిన సన్నిదానం వేదిక. పక్క చిత్రంలో పూజలు జరిగే ప్రాంగణాన్ని సందర్శించిన ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడులో నేడు కోటి బిల్వార్చన

25వేల మంది అయ్యప్ప భక్తులతో పూజలు

ప్రత్తిపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడులోని మినర్వా కళాశాల సమీపంలో సోమవారం జరిపే అయ్యప్పస్వామి లక్ష దీపోత్సవాల మధ్య కోటి బిల్వార్చనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కేరళలోని అయ్యప్ప స్వామి ఆలయం మాదిరిగా 8 ఎకరాల ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం లక్ష్మి గణపతి హోమంతో కోటి బిల్వార్చన పూజలు ప్రారంభం కానున్నాయి. చండీహోమం, పూర్ణాహుతి, గురు పూజోత్సవం, సాయంత్రం ప్రత్తిపాడులో అయ్యప్పస్వామి ఊరేగింపు, అయ్యప్ప పడిపూజ, 6గంటల నుంచి కోటి బిల్వార్చన పూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. పూజల నిమిత్తం శబరిమల సన్నిదానం నుంచి పందల రాజ్యవంశీకులు ఆలయ పూజారి మేల్ శాస్త్రి, స్వామిజీలతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు హాజరుకానున్నారు. ఇరవై అయిదు వేల మంది అయ్యప్ప భక్తులు, మరో 10 వేల మంది ప్రజలు పాల్గొనేలా మైదానాన్ని బారికేడ్లతో ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం 400 మంది మహిళా వలంటీర్లు, 200 మంది పురుష వలంటీర్లను ఏర్పాటు చేశారు. అయ్యప్పస్వామి కోటి బిల్వార్చన పూజలు నిర్వహించే ప్రాంగణాన్ని ఆదివారం సాయంత్రం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా సందర్శించారు. పూజలు నిర్వహించే యాగశాలలు, సన్నిదాన ప్రదేశాలు పరిశీలించారు. అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వారికి సూచించారు.





కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేదసభ

వేదాలు..సమస్త ధర్మాలకు మూలం

కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో హోరెత్తిన వేదసభ

కొవ్వూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేదాలు సమస్త ధర్మాలకు మూలమని, వేదస్వస్తి చేయడం వల్ల లోకమంతా సుభిక్షంగా ఉంటుందని గోష్పాదక్షేత్ర వేదశాస్త్రాభివర్ధక పరిషత్ అధ్యక్షుడు డీఆర్ఎస్ఎన్ శాస్త్రి అన్నారు. ఆదివారం కొవ్వూరు గోష్పాదక్షేత్ర వేదశాస్త్రాభివర్ధక పరిషత్ ఆధ్వర్యంలో కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని నిరంజన ధర్మజ్ఞాన కళావేదికలో తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) సహకారంతో వేద సభ జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రుత్వికులు వేద పఠనం చేశారు. వేద మంత్రోచ్ఛరణ చేస్తూ వేదస్వస్తి పలికారు. వేదశాస్త్ర పండితులు మాట్లాడుతూ కొవ్వూరు ఆధ్యాత్మిక కేంద్రమని, వేదసభలు అంతటా నిర్వహించాలన్నారు. గోష్పాదక్షేత్రంలో నిరంతరం ధర్మకార్యాలు జరుగుతుంటాయన్నారు. కార్యక్రమంలో నోరి బోగేశ్వరశర్మ, విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి, దువ్వూరి ఫణి సోమయాజులు, గుళ్ళపల్లి శర్మ, దోర్బల ప్రభాకరశర్మ, కలిగొట్ల కృష్ణారావు, చామర్తి రమా సత్యనారాయణ శాస్త్రి, పి.మురళీ కృష్ణ తదితరులతో పాటు 150 మంది రుత్వికులు, ఘనాపాటీలు, క్రమపాటీలు, వేదశాస్త్ర పండితులు పాల్గొన్నారు.



స్వామివారి దర్శనానికి క్యూ లైన్‌లో వేచి ఉన్న భక్తులు

సత్యదేవుడి సన్నిధిలో భక్తుల రద్దీ

అన్నవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. రద్దీని దృష్టిలో ఉంచుకుని రెండు గంటల నుంచి వ్రతాలు, సర్వదర్శనాలు ప్రారంభించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం వరకు అంత్రాలయ దర్శనం తాత్కాలికంగా నిలిపివేశారు. ఆదివారం ఒక్కరోజు 4,190 వ్రతాలు జరగ్గా, పలు విభాగాల ద్వారా సుమారు రూ.50లక్షల ఆదాయం లభించింది.

మొదటి కార్తీక సోమవారం ప్రత్యేక ఏర్పాట్లు: మొదటి కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తులకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఒంటిగంట నుంచి వ్రతాలు ప్రారంభించాలని ఈవో సర్క్యులర్ జారీచేశారు. సత్రం గదులు దొరకని భక్తులకు విష్ణుసదన్ హాల్స్‌లో ఉచిత వసతి ఏర్పాటు చేసి భక్తులను ప్రత్యేక వాహనాల ద్వారా ఉచిత రవాణాసౌకర్యం కల్పించారు.

రత్నగిరిపై ఉప లోకాయుక్త పూజలు



సత్యదేవుని సన్నిధిలో ఉప లోకాయుక్త రజని

సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం రాష్ట్ర ఉపలోకాయుక్త పి.రజనీ కుటుంబ సభ్యులతో స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. వారికి ఆలయ ప్రొటోకాల్ సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.



అనవసర పోస్టులు పెడితే కేసులే..

- పోస్టుపెడితే చిక్కినట్టే
- కేసుల నమోదుకు ఐజీ ఆదేశం
- సీఎంపై అసభ్యకర పోస్టు
- ఒకరిపై ఆదివారం కేసు
- 610 నోటీసులు జారీ
- సైబర్ ల్యాబ్‌లో నిఘా
- లాఠీ తీసిన కూటమి

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సహనానికి హద్దు ఉంటుందంటారు. హద్దు మీరితే బుద్ధి చెప్పక తప్పని పరిస్థితులు వస్తాయంటారు. కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఆ పనే మొదలు పెట్టింది. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సోషల్ మీడియా వేదికగా కొందరు రెచ్చిపోతున్నారు. వైసీపీ ప్రోద్బలంతో ఎన్‌డీఏ కూటమిపై..ప్రధానంగా టీడీపీ పైన, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై విషం కక్కిస్తోంది. కొన్ని పోస్టులు మరీ అసభ్యకరంగా, సభ్య సమాజం సిగ్గుపడే విధంగా ఉంటున్నాయి.ఈ దాష్టీకం ఐదేళ్ల నుంచీ ఉన్నా ఇంకా కొనసాగుతూనే ఉంది.దీంతో కూటమి ప్రభుత్వం తన హెచ్చరికలను ఆచరణ లోకి తీసు కురాక తప్పడంలేదు.ఈ క్రమంలో ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ ఆదివారం జిల్లా పోలీసులతో జరిపిన సమావేశం వాడివేడిగా సాగి ంది. సైబర్ క్రైం, సోషల్ మీడియాపై చర్చ జరిగింది.



అదే అలవాటు..

గత ఐదేళ్లలో వైసీపీ మూకలు టీడీపీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ తదితరులపై పలు రకాల అభ్యంతర పోస్టులతో చెలరేగి పోయారు. ప్రధానంగా ఫేస్‌బుక్, వాట్సప్, ఎక్స్ ఇన్‌స్టా ఇలా అందుబాటులో ఉన్న అన్ని ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా వ్యక్తిగత విషయాల్లో తలదూర్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సోషల్ మీడియా కూడా సిగ్గుపడేలా ఎన్నో పోస్టులు పెట్టేవారు. తమపై వైసీపీ నాయకులు దారుణంగా పోస్టులు పెడుతున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసినా వారినే కేసులో ఇరికించేవారు. అప్పటి సీఎం హోదాలో జగన్ కూడా వాళ్లను అన్ని విధాలుగా ప్రోత్సహించారు. ఇప్పుడు పరిస్థితి మారింది. ప్రజలు కూటమి ప్రభుత్వానికి అధికారమిచ్చారు. దీంతో వక్ర మార్గాన్ని విడనాడాలని, ప్రజలకు మేలు చేయ డంలో కలిసి రావాలని కూటమి నేతలు పదేపదే చెప్పుకుంటూ వచ్చారు. కానీ ఫలితం లేకపోయింది. సుమారు నాలుగు నెలల పాటు సీఎం చంద్రబాబు సహనం, ఓర్పు వహించారు.మరోవైపు వైసీపీ వాళ్ల బరితెగింపు అంతకంతకూ మితిమీరిపోతోంది. దీంతో బెండు తీయాల్సిందేనంటూ పోలీసులకు ఆదేశాలిచ్చారు.

ఇక కటకటాలే..

నాలుగు నెలలపాటు సహనం వహించిన కూటమి ప్రభుత్వం..ఇక బుద్ధి చెప్పండని ఆదేశాలు ఇవ్వడంతో పోలీసులు రంగంలోకి దిగారు. సైబర్ నిపుణులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఏలూరు రేంజ్ ఐజీ జిల్లా పోలీసులతో సమీక్ష చేశారు. ఎస్పీ నరసింహ కిషోర్‌తో సహా అధికారులు హాజరయ్యారు. సైబర్ క్రైం, సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులపై సుదీర్ఘంగా సమావేశం జరిగింది. ఇకపై ఉపేక్షించవద్దని, కేసులు బనాయించి దర్యాప్తు చేయాలని ఐజీ ఆదేశించారు. ఫేక్ ఐడీలపై దృష్టిసారించాలని సూచించారు. అవసరమైతే ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేయాలని దిశానిర్దేశం చేశారు. దీంతో సోషల్ మీడియాను నిరంతరం నిశితంగా గమనిస్తున్నారు. వేరేచోట్ల పెట్టిన పోస్టుల విషయంలో అక్కడ పోలీస్ సైబర్ ల్యాబ్ లో కూడా ప్రయత్నిస్తున్నారు. సెలవులు, సమయం వంటివి పక్కన పెట్టి సైబర్ ల్యాబ్ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఫొటోలను మార్ఫింగ్ చేసి రాజకీయ పార్టీల మధ్య వివాదాలు చెలరేగే విధంగా అసభ్యకర పోస్టు పెట్టారంటూ వచ్చిన ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు 'చందు వైఎస్ఆర్‌సీపీ' ఫేస్‌బుక్ ఐడీ అడ్మిన్ వీరాబత్తుల చంద్రశేఖర్(వడిశలేరు)పై ఆదివారం సాయంత్రం ఎఫ్ఐఆర్ వేశారు. డీజీ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాలతో ప్రాథమిక దర్యాప్తు అనంతరం పలు సెక్షన్ల కింద కేసు పెట్టారు. ఇప్పటికే సోషల్ మీడియాలో అకౌంట్లు ఉన్న జిల్లాలోని పలు రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ఇతర సంఘాలు, వ్యక్తులకు 610 నోటీసులు ఇచ్చారు. ఏ ఐడీ నుంచి అసభ్యకర, ప్రభుత్వ వ్యతిరేక పోస్టులు వచ్చినా ఆ ఐడీ అడ్మిన్‌పై కేసు తప్పదని హెచ్చరించారు. తమ వద్ద ఉన్న సాంకేతికతను ఉపయోగించుకొని ఫేక్ ఐడీలతో లేదా ఇతర మతలబులు చేసినా పట్టేస్తామని స్పష్టం చేశారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా జిల్లాలో వైసీపీ అనుకూల ఖాకీలు కీలకస్థానాల్లో కూర్చోవడంతో ఆయా కేసుల్లో దర్యాప్తు నీరుగారే ప్రమాదం లేకపోలేదని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

నకిలీ ఇళ్ల పట్టాల తయారీకి పాల్పడిన డిప్యూటీ తహశీల్దార్ సస్పెన్షన్


డిప్యూటీ తహసీల్దార్ శశిధర్

అనపర్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ముందు అనపర్తిలో వెలుగుచూసిన నకిలీ ఇళ్ల పట్టాల తయారీలో అప్పటి డిప్యూటీ తహశీల్దార్, ప్రస్తుత పోలవరం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ కార్యాలయం డిప్యూటీ తహశీల్దార్ శశిధర్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలు జారీ చేశారు. అనపర్తి మండలంలో భూసేకరణలో రైతులకు సొమ్ములు చెల్లించకుండా ఎటువంటి హద్దులు లేకుండా తహశీల్దార్ కార్యాలయంలో పట్టాలు తయారుచేసి పంపిణీకి సిద్ధం చేశారు. దీంతో అప్పటి ప్రతిపక్ష నాయకుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డివిషయాన్ని బయట పెట్టారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో డిప్యూటీ తహశీల్దార్ శశిధర్‌ను రంగంపేటకు బదిలీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గతనెల 7న డిప్యూటీ కలెక్టర్ స్వామినాయుడు అనపర్తి తహశీల్దార్ కార్యాలయంలో విచారణ నిర్వహించి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. దాని ఆధారంగా శశిధర్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీచేశారు.

పాపికొండలు విహారయాత్రకు పర్యాటకుల తాకిడి


పోచవరం ఫెర్రీ పాయింట్ దగ్గర పర్యాటకుల సందడి

వీఆర్‌పురం/దేవీపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాపికొండలు, పేరంటాలపల్లి పర్యాటక ప్రాంతాలలో సందడి వాతావరణం నెలకొంది. గతవారం రోజులక్రితం పాపికొండల విహారయాత్రను ప్రారంభించారు. ఆదివారం సెలవు కావడంతో పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంది. దీంతో పోచవరం ఫెర్రీ పాయింట్ దగ్గర పర్యాటకులతో సందడి వాతావరణం ఏర్పడింది. సుమారు 550మంది పర్యాటకులతో ఆరు బోట్లలో పాపికొండలకు, పేరంటా లపల్లిలో శివాలయంలో శివుడిని దర్శించుకున్నారు. ప్రకృతి అందాలను, గలగలా పారే సెలయేరులను చూసేందుకు పర్యాటకులు ఎగబడ్డారు.

మత్స్యకారులకు నష్టపరిహారం

- రూ.149.99కోట్లు ఇచ్చేందుకు ఓఎన్జీసీ అంగీకారం
- 21న లబ్ధిదారుల ఖాతాల్లో జమ ● ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు


విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఐ.పోలవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు ఓఎన్జీసీ రూ.149.99 కోట్లు నష్టపరిహారం ఇచ్చేందుకు అంగీకరించినట్టు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు తెలిపారు. ఆదివారం మురమళ్ల క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలో సముద్రంలో ఓఎన్జీసీ పైప్‌లైన్ల కార్యకలాపాలవల్ల మత్స్యకారుల చేపల వేటకు అవరోధం ఏర్పడింది. ఉపాధి లేక మత్స్యకార కుటుంబాలు విలవిల్లాడుతున్నాయి. అమలాపురం ఎంపీ గంటి హరీష్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ పలుమార్లు ఓఎన్జీసీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి జనవరి 29నుంచి జూలై 17వరకు రోజుకు రూ.460వంతున చెల్లించేందుకు ఓఎన్జీసీ అంగీకరించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 23,458 మందికి ఒక్కొక్కరికీ రూ.63,943 వంతున రూ.149.99కోట్లు విడుదల కానున్నట్టు తెలిపారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో ఎక్కువ మంది మత్స్యకారులకు నష్టం జరిగిందన్నారు. నాలుగు మండలాలకు చెందిన 20,878మందికి రూ.133.51కోట్లు పరిహారం అందనున్నట్టు తెలిపారు. ఈనెల 21 మత్స్యకార దినోత్సవ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా నిధులు విడుదలవుతాయన్నారు. నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేస్తారన్నారు. ఓఎన్జీసీ ఇచ్చే సొమ్మును తమ ప్రభుత్వం ఇస్తున్నట్టుగా గతంలో వైసీపీ నాయకులు గొప్పలు చెప్పుకున్నారని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. సమావేశంలో మత్స్యకార నాయకులు నాగిడి నాగేశ్వరరావు, దండుప్రోలు సత్యం, వాడ్రేవు వీరబాబు, అర్దాని శ్రీను, సంగాని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరానికి యూపీఈఐఎఫ్ మద్దతు

- ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి ● ఎమ్మెల్సీ చిరంజీవి
- పాల్గొన్న ఎమ్మెల్యేలు కొండబాబు, చినరాజప్ప, నానాజీ


ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరానికి మద్దతు తెలుపుతున్న యూపీఈఐఎఫ్ నాయకులు

కాకినాడ రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తరపున బరిలో ఉన్న ఉమ్మడి తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ ఫెడరేషన్ (యూపీఈఐఎఫ్) మద్దతు తెలిపింది. కాకినాడ సాంబమూర్తినగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం సంఘ కార్యదర్శి సురేష్, సంయుక్త కార్యదర్శి బేగ్ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వి.చిరంజీవి, విశిష్ట అతిథులుగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ ఎన్.పూర్ణచంద్రరావు, ఫెడరేషన్ అధ్యక్షులు దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఫెడరేషన్ వ్యవస్థాపకులు ఎం.శ్రీవిజయ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రైవేట్ పాఠశాలలు నరకం చూశాయని రకరకాల జీవోలతో రాష్ట్రవ్యాప్తంగా చిన్న పాఠశాలలు మూతపడ్డాయన్నారు. గత ప్రభుత్వంమీద 54 కేసులు హైకోర్టులో వేశామని తెలిపారు. ఫెడరేషన్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఫెడరేషన్ తరపున రాజశేఖరం గెలుపు పూర్తిగా మద్దతును తెలియజేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ చిరంజీవి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రైవేట్ విద్యాసంస్థల సమస్యలను పట్టించుకోలేదని కూటమి ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి అధికారులపై ఫిర్యాదుచేస్తే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరంను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. 6వ తేదీతో ఓటరు నమోదు ప్రక్రియ ముగుస్తుందని ఈలోపు ప్రైవేట్ విద్యాసంస్థల సహకారంతో నమోదు కార్యక్రమాన్ని పూర్తిచేయాలన్నారు. ఫార్మసీ కళాశాలల అధ్యక్షులు కనకరాజు, ఫెడరేషన్ ఉపాధ్యక్షులు నారాయణరావు, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఎమ్మెల్సీ చిరంజీవిని, అభ్యర్థి రాజశేఖరంను ఫెడరేషన్‌తరపున సత్కరించారు.

ఉండ్రాజవరంలో ఏకాదశ సహస్ర గళార్చన

ఉండ్రాజవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పెరవలి మండలానికి చెందిన హిందూ ధర్మ పరిరక్షణ సేవాసమితి ఆధ్వర్యంలో ఉండ్రాజవరంలో ఆదివారం ఏకాదశ సహస్ర గళార్చన, హనుమాన్ చాలీసా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 1008మంది చిన్నారులతో 11 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. అనంతరం జ్యోశ్యుల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గణపతి పూజ, ఆంజనేయస్వామి అష్టోత్తర పూజ జరిపారు. కార్య క్రమ సమన్వయకర్త సీహెచ్‌ఎస్ నాగభూషణం మాట్లాడుతూ నేటితరం చిన్నారులకు సనాతన సంప్రదాయాలను పరిచయం చేయడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సుంకవల్లి సూర్యానారాయణ, జీవీ సుబ్రహ్మణ్యం, కుదప చక్రపాణి, సుంకవల్లి వెంకటేశ్వర్లు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పులి జాడేది?



- దారితప్పుతున్న అటవీ అధికారుల అన్వేషణ
- అధికారుల కెమెరాలకు చిక్కని మన్యం పులి
- 20 రోజులు దాటినా కనపడని పులిజాడ ● భయం గుప్పెట్లో గిరిజనులు

కూనవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎక్కడ నుంచి వచ్చిందేమోగానీ పులి సంచారం ఇక్కడ మన్యం ప్రజల గిరిజనులను భయం వెంటాడుతూనే ఉంది. సరిగ్గా గతనెల 15వ తేదీన దూగుట్టలో పులి పాదముద్రలు కనిపించడంతో మండలంలోని మన్యంలో పులి అలజడి మొదలైంది. ఇప్పటికే నాలు గు పశువులను వేటాడి చంపింది. పులి ప్రజలకు ప్రత్యక్షంగా కనిపిస్తోంది. కానీ అటవీ అధికారులకు మాత్రం తాము ఏర్పాటుచేసిన ట్రాప్ కెమెరాలకు చిక్కడంలేదని ఫారెస్టు అధికారులు అంటున్నారు. పులిజాడ కోసం ఇప్పటికే 30కిపైగా ట్రాప్ కెమెరాలు అడవిలో అటవీశాఖాధికారులు ఏర్పాటు చేశారు. ఒక్క కెమెరాలోను పులి జాడ కనిపించడంలేదంటున్నారు. వ్యవసాయ సీజన్ కావడంతో పొలాల్లోకి వెళ్లి వ్యవసాయం చేయాలంటేనే గిరిజన ప్రాంతాల్లో కూలీలు, రైతులు భయాందోళన చెందుతున్నారు. గిరిజనుల భూములు సాధారణంగా అడవుల్లోనేఉంటాయి. వ్యవసాయం అక్కడే సాగు చేస్తారు. ప్రస్తుతం వరి, మిర్చి పం టలు సాగు చేస్తున్నారు. అటవీ ప్రాంతం దగ్గరలో ఉన్న బోదునూరు, మెట్ట రామవరం, పాలగూడెంతోపాటు వలస గ్రామాలైన రామచంద్రాపురం, కన్నాపురం గ్రామాలు సాయంత్రం 6 దాటితేనే నిశబ్దంగా మారుతున్నాయి. పగటిపూట వ్యవసాయ పనులకు వెళితే పులి వచ్చి ఎక్కడ మీద పడుతుందోనని భయానికి గురవుతున్నట్లు గిరిజనులు తెలుపుతున్నారు.

పులి భయంతో నిద్రపట్టడంలేదు



● కుంజం అనిల్

పులి భయంతో గిరిజన గ్రామాల్లో ప్రజలకు నిద్రపట్టడంలేదు. ము ఖ్యంగా పట్టు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అడవుల్లోకి వెళ్లలేక పట్టుసాగు చేయలేకపోతున్నారు. పశువులను మేపడానికి కూడాగిరిజనులు అడవిలోకి వెళ్లలేక పోతున్నారు. పులికి భద్రత కల్పించి ఇ క్కడి నుంచి దట్టమైన అడవుల్లోకి తరలించే ఏర్పాట్లు అటవీ శాఖాధికారులు చేయాలి. లేకపోతే గందరగోళం భయంతో గిరిజనులు చాలా ఇబ్బంది లు ఎదుర్కోవాల్సి వస్తోంది.

రోడ్డు ప్రమాదంలో అక్కాచెల్లెళ్లు మృతి


పుల్లలపాడు వద్ద లారీలోకి దూసుకుపోయిన కారు

- నిద్రమత్తులో లారీని ఢీకొట్టిన కారుడ్రైవర్
- మృతులు అనంతపురం జిల్లా వాసులు
- తూర్పుగోదావరి జిల్లాలో ఘటన


ప్రమాదంలో మృతిచెందిన రాజేశ్వరి, కనకదుర్గ(ఫైల్)


చికిత్స పొందుతున్న డ్రైవర్ సాకే సూర్యనారాయణ

ఏలూరు క్రైం/నల్లజర్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని నిద్రమత్తులో ఉన్న కారు డ్రైవర్ ఢీ కొనడంతో అక్కా చెల్లెళ్ళు మృతి చెందగా డ్రైవర్ తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ సంఘటన తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పుల్లలపాడు గ్రామ సమీపంలో ఆదివారం ఉదయం 5.30 గంటలకు జరిగింది. అనంతపురంనకు చెందిన అనంతపురంలోని శ్రీసత్యసాయి విద్యాసంస్థలలో ప్రొఫెసర్‌గా పని చేసి పదవీ విరమణ చెందిన కనకదుర్గ (84) వివాహం కాలేదు. ఆమె సోదరి రాజేశ్వరి (87)తో కలిసి ఉంటున్నారు. రాజేశ్వరికి కూడా వివాహం కాలేదు. అనంతపురంలోని శారదా కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరిద్దరికి సంబంధించిన ఆస్తులు కాకినాడలో ఉన్నాయి. మూడునెలలకు ఒకసారి వెళ్లి అద్దె సొమ్ములను వసూలు చేసుకుని వస్తూ ఉంటారు. దీనిలో భాగంగా అద్దె సొమ్ము వసూలు చేసుకోవడానికి వారివద్ద డ్రైవర్‌గా పనిచేసే అనంతపురం జిల్లా రాప్తాడు మండలం రామనేపల్లి గ్రామానికి చెందిన సాకే సూర్యనారాయణ (45) ఈ నెల 2వ తేదీ సాయంత్రం 5 గంటలకు అనంతపురం నుంచి కాకినాడకు కారులో వీరిద్దరు బయలుదేరారు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో విజయ వాడ దాటి న తరువాత ఓ పెట్రో ల్ బంక్ వద్ద కారు పక్కన పెట్టి నిద్రించారు. తిరిగి 4.30 గంటలకు బయలుదేరారు. మార్గమధ్యలో నల్లజర్ల మండలం పుల్లలపాడు వద్ద జాతీయ రహదారిపై ఎలాంటి సిగ్నల్స్ లేకుండా ఒక లారీ ఆగి ఉంది. దీంతో దానిని గమనించక డ్రైవర్ కారుతో ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో కనకదుర్గ అక్కడి కక్కడే మృతి చెందగా తీవ్ర గాయాలపాలైన రాజేశ్వరి, సూర్య నారాయణలను ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి వచ్చిన కొద్దిసేపటికే రాజేశ్వరి మృతిచెందింది. ఆస్పత్రి ఐసీయూలో సూర్యనారాయణ చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై నల్లజర్ల పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాల ను పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. బంధువులకు పోలీసులు సమాచారం ఇచ్చారు.

మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య



కొత్తపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోల్పోయానని మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడి మృతిచెందినట్లు ఎస్‌ఐ జి.సురేంద్ర తెలిపారు. వివరాల ప్రకారం... మండల పరిధి అవిడి గ్రామానికి చెందిన దువ్వ చంద్రశేఖర్(43) అవిడి గ్రామ పంచాయతీలో స్వీపర్‌గా పనిచేసుకుంటూ ఉండేవాడు. 2023లో అతనిని విధుల నుంచి తొలగించారు. అప్పటి నుంచి స్థానిక నాయకులు, అధికారులను కలిసి తనకు గతంలో మాదిరిగానే ఉపాధి కల్పించాలని కోరుతున్నాడు. అయినప్పటికీ ఎవ్వరూ తనకు అవకాశం కల్పించడంలేదని మనస్తాపానికి గురయ్యాడు. దీంతో శనివారం ఇంట్లో సీలింగ్‌ఫ్యాన్‌కు లుంగీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఇతని కుమారుడు దువ్వ ప్రవీణ్ చూసి పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్‌ఐ సురేంద్ర మృతదేహాన్ని పరిశీలించి స్థానిక ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమారుడు ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి



ట్రాక్టర్ ఢీకొని మృతి చెందిన వీధి శ్రీనివాసరావు, నిరసన తెలుపుతున్న కుటుంబ సభ్యులు

రావులపాలెం, నవంబరు3(ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్‌పై వెళుతున్న ఓ వ్యక్తిని వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కేదార్లంక శివారు వీధివారిలంకకు చెందిన వీధి శ్రీనివాసరావు(46)అరటి గెలలు మోటార్‌సైకిల్‌పై మార్కెట్‌యార్డుకు తెచ్చి అమ్ముతూ జీవనం సాగిస్తుంటాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రావులపాలెం మండలం లక్ష్మీపోలవరం లంక పొలాల నుంచి రావులపాలెం అరటి మార్కెట్‌యార్డుకు మోటార్‌సైకిల్‌పై లోడు తెచ్చేందుకు బయలుదేరాడు. ఆ సమయంలో లక్ష్మీపోలవరం వద్దకు వచ్చే సరికి వేగంగా పొడగట్లపల్లి వైపు వెళుతున్న ట్రాక్టర్ బలంగా ఢీకొంది. దీంతో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న బంధువులు, స్నేహితులు మృతిని కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలంటూ రోడ్డుపై బైఠాయించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు వారితో చర్చలు జరిపి అనంతరం మృతదేహాన్ని కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరించినట్లు పోలీసులు తెలిపారు.

మాకు దిక్కెవరూ....

పనికోసం వెళ్లిన తన భర్త ప్రమాదంలో మృతి చెందాడన్న వార్త విన్న మృతుడి భార్య, కుమార్తె మాకు దిక్కెవరంటూ రోదిస్తున్న తీరు అందర్నీ కలిచివేసింది. మృతిచెందిన వీధి శ్రీనివాసరావుకు భార్య ధనలక్ష్మి, కుమార్డు వీరబాబు, కుమార్తె ఉండగా కుమార్డు రెండేళ్ల క్రితం మృతి చెందాడు. కుమార్తె రాజానగరం కళాశాలలో ఎంసీఏ మొదటి సంవత్సరం చదువుతుంది. అప్పుడు కుమార్డు, ఇప్పుడు భర్త మృతి చెందడంతో ఆ తల్లీకూతురు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

నిప్పంటించుకొని యువకుడి ఆత్మహత్య


నిమ్మలపూడి సత్యసాయి (ఫైల్)

రంగంపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రంగంపేట మండలం కోటపాడులో ఓ యువకుడు శరీరానికి నిప్పు అంటించుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ తోట కృష్ణసాయి వివరాల ప్రకారం.. గండేపల్లి మండలం పి.నాయకంపల్లికి చెందిన నిమ్మలపూడి సత్యసాయి(22) ఇంటర్ పూర్తిచేసి తన అన్నయ్య నిమ్మలపూడి సాయికృష్ణతో కలిసి కోటపాడు పరిధిలో కోళ్లఫారం నిర్వహిస్తున్నారు. సత్యసాయి గతనెల 12న స్వామి అయ్యప్పమాల ధరించాడు. స్నేహితులతోనే కలిసి పూజ నిర్వహించాడు. 30న స్నేహితుడైన రాజేష్ క్రెడిట్ కార్డు ద్వారా పెట్రోల్ కొట్టించుకున్నాడు. క్రెడిట్ కార్డు తీసిన విష యం రాజేష్‌కు తెలియదు. ఒకవేళ కార్డు విషయం తెలుసుకొని రాజేష్ తనని అడుగుతాడేమోననే భయంతో మనస్థాపానికిలోనై అక్టోబరు 31న ఉదయం 4గంటలకు ఇంట్లో పూజ ఉందని చెప్పి వెళ్లి కోటపాడులోని సు కృతి లేఔట్‌లో నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలియని బంధువులు అతని జాడ కోసం మూడు రోజుల నుంచి వెతుకుతున్నారు. ఈ క్రమంలో సుకృతి లేఔట్‌లో ఈనెల 2న కాలిన గాయాలతో మృతిచెంది ఉన్నాడు. ఈ ఘటనపై మృతుడి అన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడి మృతిపై పలు అనుమానాలు

గండేపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాయకంపల్లి గ్రామానికి చెందిన నిమ్మలపూడి సత్యసాయి మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పలువురి వివరాల ప్రకారం గత 3 రోజుల కిందట సత్యసాయి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. అతను కనిపించకపోవడంతో కుటుంబీకుల్లో అలజడి మొదలైంది. సత్యసాయి మృతదేహం శనివారం ఉదయం రామేశ్వరంపేట-కోటపాడు మధ్యలో ఉన్న లేఅవుట్‌లో లభించింది. అతడి మోటారుసైకిల్ రంగంపేట వెళ్లే దారిలో బీరుఫ్యాక్టరీ సమీపంలో పార్కు చేసి ఉంది. మృతదేహానికి, బండికి కిలోమీటరు దూరం ఉంది. అయితే ఒంటికి నిప్పుపెట్టుకున్నప్పటికీ కాలిపోయిన గాయాలుండడంతో సత్యసాయి మరణంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఉచిత గ్యాస్ పథకానికి
విభజన చిక్కుముడి


తోటపల్లిలోని గ్యాస్ ఏజెన్సీ పాయింట్

- ఇంకా తెలంగాణ పేరిట గ్యాస్ కనెక్షన్లు
- అర్హత కోల్పోతున్న ఆరేడు వేల మంది గ్యాస్ వినియోగదారులు
- పదేళ్లు అవుతున్నా ఆంధ్రాకు బదిలీ చేయని కనెక్షన్లు

ఎటపాక, నవంబరు3(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర విభజన, విలీన మండలాలు ఆంధ్రాలో విలీనం జరిగి దాదాపు పదేళ్లు దాటుతున్నా... విలీన వాసులకు ఇంకా విభజన సమస్యలు తొలగడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా మహిళల కోసం ప్రకటించిన ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి విలీనవాసులు దూరమవుతున్నారు. గత ఐదారు రోజుల నుంచి ఎటపాక మండలంలో తోటపల్లి, సీతాపురం, నెల్లిపాక, రాయనపేట, నందిగామ, తదితర గ్రామాల్లోని గ్యాస్ వినియోగదారులు ముందుగా గ్యాస్ బుకింగ్ చేసుకుని, ఉచిత గ్యాస్ పథకంలో భాగంగా గ్యాస్ సిలిండర్ విలువ నగదు చెల్లించి, గ్యాస్ సిలిండర్‌ను కొనుగోలు చేసుకొంటున్నారు. గ్యాస్ నగదు 48 గంటల్లో ఖాతాల్లో జమవుతుందని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు చెప్పడంతో అనేక మంది వినియోగదారులు ఉచిత గ్యాస్ సిలిండర్‌ను బుక్ చేసుకుంటున్నారు. అయితే 48 గంటలు దాటినా వారి వారి బ్యాంకుఖాతాల్లో ఉచిత గ్యాస్‌కు సంబంధించిన నగదు జమకాకపోవడంతో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు చుట్టూ తిరుగుతున్నారు. చివరకు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు మీ గ్యాస్ కనెక్షన్లు ఇంకా తెలంగాణ (భద్రాచలం)లో నమోదు ఉన్నాయని, అందుకే నగదు జమకావడంలేదని చెప్పడంతో గ్యాస్ వినియో గదారులు కంగుతింటున్నారు.

ఇంకా తెలంగాణ పేరిట నమోదై ఉన్న కనెక్షన్లు

రాష్ట్రం విడిపోయి దాదాపు పదేళ్లు దాటుతున్నా, విలీన మండలాల గ్రామాలకు చెందిన గ్యాస్ వినియోగదారుల గ్యాస్ కనెక్షన్ల ఇంకా తెలంగాణలోని భద్రాచలం (హెచ్‌పీ గ్యాస్) పేరిట నమోదై ఉండడం, అక్కడి గ్యాస్ సంస్థ ప్రతినిధులు నిర్లక్ష్యం స్పష్టంగా కనబడు తోంది. పదేళ్లు దాటుతున్నా భద్రాద్రి హెచ్‌పీ గ్యాస్ సంస్థ ప్రతినిధులు ఆంధ్ర గ్యాస్ వినియోగదారుల కనెక్షన్లను ఆంధ్ర పరిధిలోకి బదిలీ చేయడానికి నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇన్నాళ్లు సాంకేతిక సమస్య సాకు చూపిస్తూ బదిలీ ప్రక్రియను నిలిపివేశారనే విమర్శలు ఉన్నాయి. తెలంగాణ పేరిట నమోదై ఉన్న గ్యాస్ వినియోగదారులు ప్రతీ గ్రామంలో 20, 30మంది వరకు ఉన్నట్లు ప్రాథ మిక అంచనాగా తెలుస్తోంది. వీరిలో కొందరు మొదటి ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం గ్యాస్ ఏజెన్సీలవద్ద సిలిండర్‌ను పొందుతున్నారు. సిలి ండర్ పొంది రెండు రోజులు గడుస్తున్నా నగదు జమవకపోవడంతో వినియోగదారులు లబోదిబో మంటున్నారు. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు మాత్రం ఈ సమస్యపై తెలంగాణలోని భద్రాచలం లేక మారేడుమిల్లి వెళ్లాలని వినియోగదారులకు సూచిస్తున్నారు. దాంతో గ్యాస్ వినియోగదారులు ఏం చేయాలో తెలిక అయోమయానికి గురవుతున్నారు.

అర్హత కోల్పోతున్న ఆరేడు వేల మంది వినియోగదారులు

తెలంగాణలో గ్యాస్ కనెక్షన్లు నమోదై ఉండడంతో ప్రభుత్వం అందించే ఉచిత సిలిండర్ పథకానికి మండలంలో ఆరేడు వేలమంది వినియోగదారులు అర్హత కోల్పోతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం అందించే పథకానికి వీరు అర్హులైన భద్రాచలం హెచ్‌పీ గ్యాస్ నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా పథకానికి దూరమవుతున్నారనే విమర్శలు వెలువడుతున్నారు. గత ఐదారు రోజుల నుంచి చాలామంది వినియోగదారులు ముందుగా నగదు చెల్లించి, గ్యాస్ సిలిండర్ పొందుతున్నారు.తర్వాత రెండు రోజులు గడుస్తున్నా అకౌంట్‌లో నగదు జమకాకపోవ డంతో గందరగోళంకు గురవుతున్నారు. గ్యాస్ ఏజెన్సీనిర్వాహకులు ఆధార్‌కార్డుల మార్పు, ఈకేవైసీ చేసుకోవాలని సూచిస్తూ ఉండడంతో వినియోగదారులు వాటిని కూడా చేయిస్తున్నారు. ఈకేవైసీ పేరుతో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు రూ 200 వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నారు. ఈ విషయమై భద్రాచలం హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ వెంకన్న సంప్రదించగా సాంకేతిక కారణంగా బదిలీ ప్రక్రియలో జాప్యం జరిగిందని, వినియోగదారులు గ్యాస్ బుక్, డాక్యుమెంట్, ఆధార్‌తో తమ వద్దకు వస్తే సమస్యను పరిష్కస్తామని చెప్పారు.

తలుపులమ్మ కరుణించమ్మ

- ఆలయానికి రూ.1.27లక్షల ఆదాయం


భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ అమ్మవారు

తునిరూరల్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలంలో ప్రసిద్ధి పుణ్య క్షేత్రం లోవ దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారి దర్శనార్థం తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. వేకువజామునే అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించిన ఆలయ అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. ప్రత్యేక క్యూలైన్‌లో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం ఒక్కరోజే భక్తుల నుంచి వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.1.27లక్షల ఆదాయం సమకూరింది.

రాష్ట్రంలో తొలి ఎపిసర్ఫ్ మార్పిడి సర్జరీ


రాజమహేంద్రవరంలో ఎపిసర్ఫ్ మార్పిడి సర్జరీ వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్లు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోనే తొలి ఎపిసర్ఫ్ మార్పిడి సర్జరీ రాజమహేంద్రవరంలోని సాయి హాస్పిటల్‌లో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు ఆసుపత్రి ఎండీ డాక్టర్ కురుకూరి విజయ్‌కుమార్ ఆదివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అరుదైన మోచిప్ప మార్పిడి సర్జరీ చేయడం దక్షిణ భారత దేశంలోనే ఇది మూడోవదన్నారు. బెంగుళూరులో ఒకటి, హైదారాబాద్‌లో ఒకటి మాత్రమే జరిగాయని, మూడోవది రాజమహేంద్రవరం సాయి హాస్పిటల్‌లో చేశామన్నారు. మోచిప్ప అరుగుదలకు సంబంధించి చేసే సర్జరీని ఎపిసర్ఫ్ సర్జరీ అంటారన్నా రు. తమ ఆసుపత్రికలో.. అమెరికాలో స్థిరపడిన ఎన్ఆర్ఐ పేషంట్ మోచిప్పలో ఉన్న అరుగుదలను సరిచేసేందుకు ఇంప్లాట్లను పేషంట్‌కు తగ్గట్టుగా ఇంప్లాంట్ల తయారీ సంస్థలు డిజైన్ చేసి తయారు చేశాయన్నారు. స్వీడన్‌లో వాటిని తయారు చేశాయన్నారు. దానిని తమ ఆసుపత్రిలో తనతోపాటు మంగుళూరుకు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ దీపక్ రే, యశోదా హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పూర్ణచంద్రతేజస్వి కలిసి గంట వ్యవధిలో సర్జరీ పూర్తిచేశామని విజయ్‌కుమార్ చెప్పారు.

వైద్యానికి వెళ్తే కాళ్లకు సుస్తి!

గోకవరం ప్రభుత్వాసుపత్రిలో సౌకర్యాల లేమి

- డాక్టర్ కోసం గంటల తరబడి నిలబడి ఉంటున్న రోగులు
- గర్భిణులు, వృద్ధుల అగచాట్లు


కుర్చీలు లేక డాక్టర్ పిలుపు కోసం నిలబడి ఉన్న గర్భిణులు

గోకవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సుస్తీ చేసి ఆసుపత్రికి వెళ్తుంటే గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితి గోకవరం ప్రభుత్వాసుపత్రిలో నిత్యం కనిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో సుమారు రూ.5 కోట్లతో 30పడకల ఆసుపత్రిని నిర్మించినప్పటికీ అందులో ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం మర్చిపోయారు. దీంతో అనారోగ్యానికి గురై ఆసుపత్రికి వెళ్తుంటే అక్కడ కూర్చోవడానికి కుర్చీలు, ఇతర సౌకర్యాలు లేక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆపసోపాలు పడుతున్నారు. ముఖ్యంగా వైద్యుల గదుల వద్ద గంటల తరబడి గర్భిణులు, చిన్న పిల్లల తల్లిదండ్రులు, వృద్ధులు ఉండాల్సిన దుస్థితి. కొందరు ఎక్కువ సమయం నిరీక్షించలేక మెట్ల పైనే నడుం వాలుస్తున్నారు. ప్రతిరోజూ సుమారు 200 నుంచి 300 మంది రోగులు ఈ ఆసుపత్రికి వస్తుంటారు. వైద్యుల వద్దకు వెళ్లి పరీక్షలు పూర్తి చేసుకొని ఇళ్లకు చేరుకునే సరికి ఓపిక నశించిపోతోంది. ఉన్నతాధికారులు స్పందించి గోకవరం ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు కూర్చోవడానికి వీలుగా సౌకర్యాలు ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.


కుర్చీలు లేక మెట్లపై కూర్చున్న రోగులు

మహిళల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

'మీ భద్రత-మా బాధ్యత'లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు


సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 39వ డివిజన్‌లో ఆదివారం రాత్రి టీడీపీ పార్లమెంట్ డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు యాళ్ల ప్రదీప్ అధ్యక్షతన జరిగిన మీ భద్రత-మా బాధ్యత సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. రాజమహేంద్రవరంలో గంజాయి, బ్లేడుబ్యాచ్‌లు చాలా భయానక వాతావరణం సృష్టించేవని కాని కూటమి ప్రభుత్వం వచ్చాక ఉక్కుపాదం మోపి వాటిని సమూలంగా నిర్మూలించామన్నారు. రాష్ట్రంలో మొదటిసారిగా రాజమహేంద్రవరంలోనే మహిళ రక్షక్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో త్రీటౌన్ సీఐ అప్పారావు, స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

టీటీడీ పాలకవర్గ సభ్యుడు అక్కినకు సత్కారం


ముని కోటేశ్వరరావును సన్మానిస్తున్న కాకతీయ అసోసియేషన్ సభ్యులు

రాజమహేంద్రవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడిగా నియమితులైన అక్కిన మునికోటేశ్వరరావును జిల్లా శ్రీకాకతీయ అసోసియేషన్ ఫర్ మ్యాన్ కైండ్ మోరల్స్ అండ్ ఎచీవ్‌మెంట్ సంస్థ ఘనంగా సత్కరించింది. స్థానిక రివర్‌బేలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయనను సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా ముని కోటేశ్వరరావు మాట్లాడుతూ స్వామికి సేవ చేసే భాగ్యం తనకు లభించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ, డాక్టర్ గన్ని భాస్కరరావు, బొప్పన బ్రహ్మాజీ, కంటిపూడి సర్వారాయుడు, మార్ని వాసు, మేడ గంగాధర్, బొప్పన సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్‌సీ రైల్వే స్కౌట్స్ అండ్ గైడ్స్ డైమండ్ జూబ్లీ


మొక్కలు నాటుతున్న సిబ్బంది

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సౌత్ సెంట్రల్ రైల్వే భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాజమండ్రి విభాగం స్కౌట్ గైడ్ వీక్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ వార్షికోత్సవంలో భాగంగా రాజరాజ నరేంద్ర, గోదావరి ఓపెన్ గ్రూప్ ముఖ్య అతిథిగా బి.సైదయ్య ఐపీఎఫ్(ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ప్రొటెక్షన్ ఫోర్స్), ఆర్‌పీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీ వరలక్ష్మి, ఇతర సిబ్బంది రైల్వే స్కౌట్ డెన్ ఆవరణలో ఆదివారం కబ్స్, బుల్బుల్స్, స్కౌట్స్, గైడ్స్, రోవర్స్, రేంజర్స్ మొక్కలు నాటారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ దేశమంతటా స్కౌట్స్ అండ్ గైడ్స్ వీక్‌ను జరుపుకుంటూ సమాజానికి ఎంతో మేలు చేస్తున్నారని సైదయ్య తెలిపారు. అనంతరం వరలక్ష్మి మాట్లాడుతూ సమాజసేవలో ముందంజలో ఉండాలన్నారు. కార్యక్రమ నిర్వహణకు రేంజర్ ఎస్.ఐంద్రి, రోవర్ బి.నూకరాజు, పి.శ్యామ్, స్కౌట్ కె.కౌశిక్ సహకారం అందించారు.

కొత్తపల్లిలో వరుస చోరీలు


గోకవరం, నవంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శనివారం అర్ధరాత్రి నాల్గు వరుస చోరీ ఘటనలు జరిగాయి. ఓ వృద్ధుడిపై కూడా దాడి జరగడం స్థానికంగా కలకలం రేపింది. కొత్తపల్లిలో రెండు దేవాలయాలు, బజ్జీల దుకాణం, బేకరీ షాపులో ఈ చోరీలు జరిగినట్లు స్థానికులు తెలిపారు. దొంగతనం చేసే సమయంలో దిండి బాబూరావు అనే వృద్ధుడు ఆగంతకులను నిలదీయడంతో విచక్షణారహితంగా దాడి చేసి గాయపర్చినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. అతడిని రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. చోరీలో ముగ్గురు వ్యక్తులు పాల్గొన్నట్లు సీసీ టీవీల ఆధారంగా తెలుస్తోంది. ఒకే రోజు నాల్గు దొంగతనాలు జరగడం, ఓ వ్యక్తిని గాయపర్చడం వంటి సంఘటనలు జరగడంతో కొత్తపల్లి ప్రజానీకం తీవ్ర భయాందోళనలో ఉన్నారు.

సోమును కలిసిన కంబాల

గోకవరం, నవంబరు3(ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ నాయకుడు సోము వీర్రాజును విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఈనెల 25న గోకవరంలోని సీఎండీ కేఎస్‌పీవీ లేఅవుట్‌లో బహిరంగ సభ ఏర్పాటుచేసి బీజేపీలో చేరుతున్నట్టు వీర్రాజుకు వివరించారు. ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా రావాలని ఆయనను ఆహ్వానించారు. కార్యక్రమంలో మట్టా మంగరాజు, మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఇనగోటి బాపన్నదొర, వరసాల ప్రసాద్, వల్లూరి జగన్నాధరావుశర్మ పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- దేచర్ల వద్ద ఘటన


మృతుడు మాణిక్యాలరావు


ప్రమాదంలో గాయపడిన గోవిందరాజులు

కొవ్వూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. రాజమహేంద్రవరం సీతంపేట గ్రామానికి చెందిన వాడపల్లి మాణిక్యాలరావు(60), కడియం గోవిందరాజులు, కడియం సుధీర్‌లు కలిసి స్కూటీపై కొవ్వూరు మండలం పంగిడి బయలుదేరారు. ఎక్స్‌ప్రెస్ హైవేపై సర్వీసు రోడ్డును దాటి ముందుకు వెళ్లిపోయారు. దేచర్ల గ్రామ శివారులో పంగిడి దాటిపోయామని గమనించి స్కూటీని కుడివైపునకు తిప్పుతుండగా వెనుక వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మాణిక్యాలరావు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందగా గోవిందరాజులు, ఆయన మనుమడు సుధీర్‌లకు గాయాలు కావడంతో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆపై అత్యవసర వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు. కాగా మాణిక్యాలరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు. సమాచారం తెలుసుకున్న కుమారుడు చెన్నై నుంచి బయలుదేరినట్టు సమాచారం.

వన సమారాధనలతో ఐక్యత పెంపు

- మంత్రులు సుభాష్, దుర్గేష్
- పలుచోట్ల కార్తీక అన్నసమారాధనలు


ధవళేశ్వరంలో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

ధవళేశ్వరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీక వన సమారాధనలు ఐక్యతను పెంపొందిస్తాయని మంత్రులు వాసంశెట్టి సుభాష్, కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం ధవళేశ్వరంలో కాటన్ మ్యూజియం వద్ద నిర్వహించిన శెట్టి బలిజ సంఘ కార్తీక వన సమారాధనకు వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. సుభాష్ మాట్లాడుతూ శెట్టిబలిజలు అన్నిరంగాల్లో ఎదగాలని రాజకీయాలను శాసించే స్థాయికి చేరుకోవాలన్నారు. దుర్గేష్ మాట్లాడుతూ మరింత మంది చట్ట సభల్లో కూర్చుని తమ వాణిని వినిపించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, శెట్టి బలిజ సంఘ అధ్యక్ష కార్యదర్శులు బసనబోయిన సత్తిబాబు, కేఎస్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ముత్యాలమ్మ ఆలయం వద్ద జరిగిన అన్నసమారాధనలో రథం వీధి నుంచి శివాలయం వరకు పంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. 15వేలు పైబడి భక్తులు విచ్చేసి అన్నప్రసాదాలు స్వీకరించారు. ఆలయ నిర్వాహకుడు మెండా సీతారావయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా బొమ్మూరులోని టిడ్కో గృహాలు వద్ద ఫేజ్-1లోని సిద్ధి వినాయక వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వన సమారాధనలో సావాడ శ్రీనివాసరెడ్డి, ఎస్.శ్రీను, కర్రి నాగిరెడ్డి, ఏలూరు రాంబాబు తదితర 2వేల మంది పాల్గొన్నారు.


రాజమహేంద్రవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కుడుపూడి

చెరువుకూరి వారి తోటలో..

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 2(ఆంధ్ర జ్యోతి): రాజమహేంద్రవరం జాతీయ రహదారి చెరువుకూరి వారి తోటలో రాష్ట్ర శెట్టిబలిజ సం క్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వనభోజనాలు సందడిగా సాగాయి. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సానబోయిన రామారావు సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ ముఖ్యఅతిథిగా విచ్చేసి శెట్టిబలిజ పితామహుల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామారావుతోపాటు డాక్టర్ అనుసూరి పద్మలత, పిల్లి నిర్మల, పితాని లక్ష్మి, సింహా నాగమణి, రావులపాలెం జడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాస్, రాజానగరం జడ్పీటీసీ వాసంశెట్టి పెద్దవెంకన్నలను సత్కరించారు. అలాగే అక్కడే నిర్వహించిన వధూవరుల పరిచయ వేదికకు 163 మంది అబ్బాయిలు, 128 అమ్మాయిలు హాజరయ్యారు. పలువురిని సత్కరించారు. కార్యక్రమంలో బత్తిన ప్రసాద్, కట్టా సత్యనారాయణ, పలివెల సత్యనారాయణ, పిల్లి రామ్‌ప్రసాద్, గుత్తుల గోపినాధ్, పిల్లి శ్రీను పాల్గొన్నారు.

బీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బేసిక్ మెడికల్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో పిల్లి శ్రీనివాస్ తోటలో ఆర్యాపురం బ్యాంక్ డైరెక్టర్ పడాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్తీక సమారాధన జరిగింది. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వీవీ కృష్ణారావు, ఎస్.రామలక్ష్మణరావు, ఎస్.మురళీధరన్, వైఎస్ సత్యనారాయణ, ఎం.శ్రీనివాస్, హెచ్.హరిబాబు, ఆర్.శ్యాంకుమార్ పాల్గొన్నారు.

వర్తక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

దివాన్‌చెరువు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువులో శ్రీలక్ష్మీగణపతి వర్తక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనసమారాధన జరిగింది. దివాన్‌చెరువు-శ్రీరాంపురం రోడ్డులోని ఆకుల అమ్మారావు తోటలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్థులతో బాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రుడా మాజీ చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి, మాజీ ఎంపీ మార్గాని భరత్, ఆకుల తమ్మారావు, గంగిశెట్టి చంటిబాబు, దాసరి శ్రీనివాస్, ఖండవిల్లి లక్ష్మి, దేశాల శ్రీను, నీలపాల పండు విచ్చేశారు. కార్యక్రమంలో లక్కీడిప్, వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఓటు నమోదు చేసుకోండి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈనెల 6వ తేదీలోగా పట్టభద్రులైన వారు తప్పక ఓటు హక్కును నమోదు చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మార్చిలో జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని చెప్పారు.

భగినీ హస్త భోజనాలు


రామవరంలో సోదరుడికి భగినీ హస్త భోజనం వడ్డిస్తున్న సోదరి

అనపర్తి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక శుద్ధ విదియ సందర్భంగా మండలంలో పలు చోట్ల భగినీ హస్త భోజనాలు సంప్రదాయబద్ధంగా జరిగాయి. కార్తీక శుద్ధ విదియ రోజున సోదరుడిని ఇంటికి పిలిచి భోజనం పెడితే రెండు కుటుంబాలకు మంచి జరుగుతుందనే నమ్మకంతో సోదరీమణులు భగినీ హస్త భోజనాలు పెట్టడం ఆనవాయితీ. విదియ తిథి సందర్భంగా ఆదివారం పలువురు ఆడపడుచులు తమ సోదరులకు భగినీ హస్త భోజన కార్యక్రమాలను నిర్వహించారు.

నేత్రపర్వంగా అయ్యప్ప పడిపూజ


రాజానగరంలో కలశాలతో మహిళల గ్రామోత్సవం

రాజానగరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాజానగరంలో అయ్యప్ప పడిపూజ ఆదివారం నేత్రపర్వంగా జరిగింది. దీనిలో భాగంగా తొలుత తెల్లవారు జామున స్థానిక వినాయక గుడి ప్రాంగణంలో గణపతి హోమం నిర్వహించారు. అనంతరం రథయాత్రలో అయ్యప్ప భక్తులు, మహిళా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి గ్రామోత్సవం చేపట్టారు. సాయంత్రం అయ్యప్ప పడిపూజ వైభవంగా జరిపించారు. స్థానిక, పరిసర గ్రామాల అయ్యప్ప, శివ మాల ధారులు పాల్గొని పూజాకార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ ప్రవచకర్త రాధామనోహర్ దాస్ ముఖ్యఅతిథిగా విచ్చేసి రామాయణం, మహాభారతంలోని పలు ఘట్టాలను వివరిస్తూ, భక్తి గీతాలను ఆలపించారు. ఎవరైనా మనకు నమస్కారం చేసినా, దణ్ణం పెట్టినా మనలోని పరమాత్మకు పెట్టినట్టుగా భావించాలని ప్రవచించారు. వినయంతో ఉండాలని, ధర్మాన్ని విడిచిపెట్టరాదని ప్రబోధించారు.

రంగంపేట: రంగంపేటలో శ్రీమణికంఠ క్షేత్రం వద్ద చొల్లంగి అర్జునరావు గురుస్వామి ఆధ్వ ర్యంలో నిర్వహించిన స్వామిఅయ్యప్ప లక్ష బిల్వార్చన, పడిపూజ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్జునరావు సేవలను ప్రశంసించి సత్కరించారు. అనంతరం ఆయన స్వామి విగ్రహానికి పూజలు నిర్వహించగా అర్చకులు వేద ఆశీర్వాదం చేశారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన డప్పు శ్రీనుస్వామి కళాబృందం ఆలపించిన సంకీర్తనలు అలరించాయి. అంతకు ముందు స్వాములు కాగడ హారతితో గ్రామంలో ఊరేగారు.

అనపర్తిలో పేటతుళ్లి

అనపర్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అనపర్తి కెనాల్ రోడ్డులో అయ్యప్పస్వామికి దీక్షాధారులు పేటతుళ్లి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవ విగ్రహంతో భక్తులు గ్రామ వీధుల్లో శోభాయాత్ర జరిపారు. మాలలు ధరించిన 500మంది భక్తులు పాల్గొన్నారు.


అనపర్తిలో పేటతుళ్లి నిర్వహిస్తున్న అయ్యప్ప దీక్షాదారులు

నటించే వారు ఉన్నంత కాలం కష్టపడే వారికి అన్యాయమే

కాంగ్రెస్ పార్టీ నేత బాలేపల్లి



రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పార్టీ అధిష్టానం వద్ద నటించేవారు ఉన్నంతకాలం కష్టపడి పనిచేసే వారికి అన్యాయమే జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాలేపల్లి మురళీధర్‌రావు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ఆది నుంచి చాలా కష్టపడి పనిచేస్తున్నామని, ప్రతి ఐదునెలలకు పార్టీ అధినాయకత్వం రాష్ట్రంలో అధ్యక్షులను మార్చడం, దానికి అనుగుణంగా కొత్త కమిటీలు వస్తున్నాయని, కష్టపడి పనిచేసేవారిని పక్కనపెడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో తాను నగర అధ్యక్షుడిగాను, రూరల్ ఇన్‌చార్జీగాను ఉండడం కంటే పార్టీ సాధారణ కార్యకర్తగా ఉండడం మేలని భావించి ఆయా పదవులకు రాజీనామా చేస్తున్నానని బాలేపల్లి మురళీధర్‌రావు చెప్పారు.

12 టీబీ ముక్త పంచాయతీలు

సీతానగరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): టీబీ ముక్త పంచాయతీలుగా మండలంలోని 12 పంచాయతీలను గుర్తించినట్టు సీతానగరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఏవీకె చైతన్య తెలిపారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ టీబీ ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా 2023లో టీబీ వ్యాధి నిర్మూలనకు విశేష కృషి చేసిన సీతానగరం, సింగవరం, పురుషోత్తపట్నం, చీపురుపల్లి, ముగ్గళ్ల, కూనవరం, వెదుళ్లపల్లి, కాటవరం, జాలిమూడి, మునికూడలి, ములకల్లంక, మిర్తిపాడు పంచాయతీలను టీబీ ముక్త పంచాయతీలుగా గుర్తించినట్టు చెప్పారు. ఈ 12 పంచాయతీల కార్యదర్శులు శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా కాంస్య పతకాలతో పాటు ప్రశంసాపత్రాలు అందుకున్నారన్నారు.

వివాహితపై హత్యాచారం దారుణం

- ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోపీశ్రీనివాస్
- బాధిత కుటుంబానికి బీజేపీ, సీపీఎం, ప్రజాసంఘాల పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

కడియం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గంజాయి మత్తులో వివాహితపై హత్యాచారానికి పాల్పడడం దారుణమని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రొంగల గోపీశ్రీనివాస్ అన్నారు. మండలంలోని బుర్రిలంకలో హత్యాచార బాధిత కుటుంబాన్ని బీజేపీ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కూలీలకు, యువతకు గంజాయి ఎలా లభిస్తోందో రాష్ట్ర ప్రభుత్వం ఆరా తీయాలని, పోలీసు అధికారులు గంజాయిపై నిఘా పెంచాలన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలన్నారు. ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ ఆకుల శ్రీధర్, యానాపు ఏసు, నాగులపల్లి వీరబాబు, కరుటూరి శ్రీనివాస్, కొటికలపూడి వెంకటేశ్వరరావు, బొర్సు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మహిళా కూలీలకు భద్రత కల్పించాలి

నర్సరీల్లో పనిచేసే మహిళా కూలీలకు భద్రత కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. హత్యాచార బాధిత కుటుంబాన్ని అరుణ్‌తోపాటు ఐద్వా జిల్లా కార్యదర్శి పి.తులసి, ఉపాధ్యక్షురాలు స్రవంతి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వై.బేబీరాణి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ మూర్తి, సీపీఎం, యూటీఎఫ్ నాయకులు పి.మురళి, చిలుకూరి శ్రీనివాసరావు పరామర్శించారు. సంఘటన వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, డీఎస్పీతోను ఫోనులో మాట్లాడారు. నిందితులకు కఠినంగా శిక్ష పడేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి సీఎం సహాయనిధి నుంచి రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, ఇల్లు మంజూరు చేయాలని, మానసిక దివ్యాంగురాలైన చిన్నారికి పెన్షన్ ఇవ్వాలని, కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళ పనిచేసే నర్సరీ యాజమాన్యం, నర్సరీ అసోసియేషన్ ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

రామవరం-రాయవరం పుంత రోడ్డు పనులు

అనపర్తి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రామవరం-రాయవరం రామదాసు పుంత అభివృద్ధి పనులు శరవేగంతో సాగుతున్నాయి. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఈ రోడ్డు అభివృద్ధికి రూ.1.50 కోట్లు మంజూరు చేయించగా గత నెలలో పనులు ప్రారంభమయ్యాయి. పనులను ఆదివారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి పరిశీలించారు. రెండు నియోజకర్గాలను కలుపుతూ సాగే ఈ రహదారిని గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. త్వరలోనే పనులు పూర్తి చేస్తామన్నారు.

తుమ్మలపల్లి పరామర్శ

గోకవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లవరం, గోకవరం గ్రామాల్లోని పలు కుటుంబాలను ఆదివారం జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పరామర్శించారు. మల్లవరంలో జనసేన నాయకుడు షేక్ నాగూర్ ఇటీవల అనారోగ్యానికి గురవ్వడంతో ఆయనను పరామర్శించి యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గోకవరంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన ప్రగడ లక్ష్మణరావు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురవ్వడంతో ఆయనను కూడా పరామర్శించారు. రమేష్ వెంట పలువురు జనసేన నాయకులున్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పీజీఎం పాఠశాల 2012-2014 బ్యాచ్‌ల టెన్త్ విద్యార్థులు

దివాన్‌చెరువు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువులోని పీజీఎం పాఠశాలలో 2012-2014 సంవత్సరాల మధ్య పదో తరగతి చదివిన మూడు బ్యాచ్‌ల విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం దివాన్ చెరువు సమీపంలోని గోదావరి మహా పుష్కరవనంలో ఆదివారం జరిగింది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా కలుసుకుని ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సంతోషంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం జీఆర్పీ పరిధిలోని ద్వారపూడి రైల్వే స్టేషన్ అప్‌లైన్ యార్డు సమీపంలో ఆదివారం ఉదయం సుమారు 48 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది ఉన్నాడని ఎస్ఐ కె.మావుళ్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మృతుడి ఒంటిపై ఎరుపురంగు డ్రాయర్, తెలుపురంగుపై సిమ్మెంట్ రంగు చారలు చొక్కా, సిమ్మెంట్ రంగు ప్యాంటు, తెలుపురంగు కట్ బనియన్, తెలుపు ఎరుపునీలం గడుల రుమాలు ఉన్నాయని తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు జీఆర్పీ రాజమహేంద్రవరం స్టేషన్ నెంబరు 0883-2442821, ఎస్ఐ నెంబరు 9491003239ను సంప్రదించాలని కోరారు.

విజయదుర్గ ఆలయ పునః ప్రారంభ పూజలు

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్యాపురం లింగంపేట కొత్తరోడ్ వాంబే గృహాల వద్ద విజయదుర్గ ఆలయం పునః ప్రారంభం సందర్భంగా ఆలయ ధర్మకర్త పడాల వెంకటేష్ దంపతుల ఆధ్వర్యంలో ప్రథమ వార్షిక కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అర్చనలు చేసి మహిళలు కుంకుమ పూజలు జరిపారు. గోదావరి నది లక్ష్మీగణపతి ఘాట్ నుంచి మహిళలు 101 బిందెలతో బిందెలతో గోదావరి జలాలను తీసుకొచ్చి మూలవిరాట్‌కు జలాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని పూలమాలలో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



నేడు తొలి కార్తీక సోమవారం

కార్తీక మాసంలో సోమవారానికి ప్రాముఖ్యత ఉంటుంది. సోమవారం మహాశివుడికి ప్రీతికరమైన రోజు కావడం పైగా ఈ మాసంలో తొలి సోమవా రం కావడంతో సోమవారం గోదావరి స్నానాలకు భారీగా భక్తులు వస్తారు. ఇందుకు తగ్గ ఏర్పాట్లను అధికారులు చేస్తున్నారు.తెల్లవారుజామున 2గంటల నుంచి భక్తులు తాకిడి మొదలవుతుందని సమాచారం. గోదావరి ఘాట్ల వద్ద ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేశారు. ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని నియమించారు. ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు గోదావరి మాతకు మహా నీరాజనం

10 వేల మంది వీక్షించే విధంగా కొవ్వూరులో ఏర్పాట్లు

కొవ్వూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో అఖండ గోదావరి నదికి అందించే కార్తీక హారతికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు క్షేత్రంలోని ప్రధాన స్నాన ఘట్టంలో నదిలో పం టు ఏర్పాటు చేశారు. ఆ పంటుపై తిరుమల తిరుపతి నుంచి తీసుకువస్తున్న ఉత్సవమూర్తులను ఉంచుతారు. అనంత రం కార్తీకమాసం సోమవారం పురస్కరిం చుకుని అఖండ గోదావరి మాతకు (మహా నీరాజనం) హారతి అందజేస్తారు.సోమవారం సాయంత్రం 5-30 గంటల నుంచి 7-30 గంటల వరకు తితిదే నుంచి తీసుకువచ్చిన శ్రీ భూ సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు విశేష పూజలు, హరి నామ సంకీర్తనల అనంతరం గోదారమ్మకు వివిధ రకాల హారతులను అందించి మహా నీరాజనం సమర్పించడం జరుగుతుందని దాస సాహిత్య ప్రాజెక్టు కొవ్వూరు కోఆర్డినేటర్ రోహిణికుమార్ తెలిపారు.ఈ కార్యక్రమాన్ని సుమారు 10 వేల మంది భక్తులు వీక్షించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో గోదావరిపై ఏర్పాటు చేసిన పంటు

భక్తజన గోదావరి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 3 , (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం, కొవ్వూరులోని గోదావరి స్నాన ఘట్టాలు కార్తీక శోభతో అలరారుతున్నాయి. ఆదివారం వేకువజామున 3 గంటల నుంచి భక్తులు కోటిలింగాలరేవు, చింతాలమ్మఘాట్, పద్మావతి ఘాట్, పుష్కరాల రేవు, టీటీడీ ఘాట్, మార్కండేయ ఘాట్, దోబీఘాట్ , సరస్వతి ఘాట్, గౌతమి ఘాట్, కొవ్వూరు గోష్పాదక్షేత్రం తదితర ఘాట్లలో భక్తులు గోదావరి స్నానాలు చేశారు. ఆయా రేవుల్లో కొబ్బరి డిప్పలు, ఆరటీ డొప్పల్లో కార్తీక దీపాలను విడిచిపెట్టారు. తెల్లవారుజాము నుంచి ఉదయం 7:30 గంటల వరకు కార్తీక దీపా లు వదిలారు. అనంతరం సమీపంలోని దేవాయాలలకు వెళ్లి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. దీంతో ఉదయం నుంచి గోదావరి ఘాట్లు భక్తజనంతో కిటకిటలాడాయి. ఆదివారం కావడంతో ఎక్కడెక్కడి నుంచో భక్తజనం తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. ఆదివారమే ఇలా ఉంటే సోమవారం మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.



పుష్కరఘాట్‌లో స్నానమాచరిస్తున్న భక్తజనం

రఘుదేవపురంలో నిధులు దుర్వినియోగం

రూ 1.18 కోట్లు తినేశారు..
అధికారుల విచారణ బయటకు
ఆరుగురికి షోకాజ్ నోటీసులు

సీతానగరం,నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రఘుదేవపురం పంచాయతీలో రూ 1.18 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్టు అధికారులు నిర్ధారించారు. రఘుదేవపురం పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై గతంలో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టి అధికారులు పంచాయతీ రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ ఇందుగుమిల్లి చంద్రలీల రూ.38,89,799 , పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసిన కేవీఎస్ఎస్ రాజశేఖర్ రూ. 15,83, 271, జీఎస్ఎస్ సాయి రూ 15,73,835, బి.అప్పారావు రూ.15,63,221, బిల్ కలెక్టర్ వై.అర్జునుడు 17,26,053 దుర్వినియోగం చేసినట్టు గుర్తించి జిల్లా కలెక్టర్ ప్రశాంతి షోకాజ్ నోటీసులు జారీచేశారు.పార్ట్‌టైం అటెండర్‌గా పనిచేస్తున్న జి లాల్ కుమార్ ఖాతాలో 15,02,000 నగదు గల్లంతు కావడంతో అతనికి కూడా షోకాజ్ నోటీస్ ఇచ్చారు. ఈ షోకాజ్ నోటీసులపై సంజాయషీ కోరారు. ఈ విషయమై ఈవోపీఆర్‌డీ మూర్తిని వివరణ కోరగా షోకాజ్ నోటీసులు రావడం వాస్తవమని వారిని సస్పెండ్ చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. వీరిలో అప్పటి కార్యదర్శి సాయి కాటవరం వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ మేరకు రఘుదేవపురం పంచాయతీ ఆవరణలో ఆదివారం కూటమి నాయకులు విలేకరులతో మాట్లాడారు. విచారణ సమయంలో ఎంపీపీ జ్యోత్స్న, షాడో సర్పంచ్ (అనధికార సర్పంచ్) గెద్దాడ త్రిమూర్తులు ఎటువంటి అవినీతి జరగలేదని, అవినీతి జరిగినట్టు నిరూపిస్తే మా ఆస్తులు మొత్తం రాసిస్తామని సవాల్ విసిరారని అన్నారు. మాట నిలబెట్టుకుని వారి ఆస్తులు పంచాయతీకి రాసివ్వాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో కాండ్రు శ్రీనివాసరావు సూరి నాగు,సుబ్బారావు,రామారావు,దొడ్డ శ్రీను, మునుకోటి శ్రీను పాల్గొన్నారు.

కమిషనరేట్‌కు హుకుంపేట
కార్యదర్శి సరెండర్

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం రూరల్ మండలం హుక్కుంపేట గ్రామ పంచాయితీ కార్యదర్శిగా ఇటీవల జాయిన్ అయిన రాజశేఖర్‌ను పీఆర్ కమిషనరేట్‌కు సరండర్ చేస్తూ కలెక్టర్ ప్రశాంతి ఉత్తర్వులు జారీ చేశారు. రాజశేఖర్ గతంలో సీతానగరం మండలం రఘుదేవపురం పంచాయతీలో పనిచేసిన కాలంలో నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని ఫిర్యాదుల రావడంతో విచారణ జరిపారు. దీనిపై కలెక్టర్‌కు వచ్చిన నివేదిక ఆధారంగా రాజశేఖర్‌ను పీఆర్ కమిషనరేట్‌కు సరెండర్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలిచ్చారు. అదేవిధంగా ఆ తర్వాత కాలంలో పనిచేస్తూ దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలు కూడా వాస్తవాలని తెలడంతో మరో ముగ్గురిపై చర్యలు తీసుకున్నట్టు తెలిసింది.



ప్రాణాలు తీసిన నిద్రమత్తు

రోడ్డు ప్రమాదంలో అక్కాచెల్లెళ్ల మృతి 8



కలపరు.. వదలరు!

13 ఏళ్లుగా వీడని విలీన వేదన

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 3 (ఆం ధ్రజ్యోతి): 13 ఏళ్లుగా 'ప్రత్యేక' పాలన.. నేటికీ పంచాయతీల సంగతి అతీగతీ లేదు.. ప్రత్యేకాధి కారులు పట్టించుకోవడం లేదు..పాలక వర్గాలు లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కొన్ని గ్రామాల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. దీనికి కారణం ఆయా గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు జరగక ప్రత్యేకాధికారుల పాలనలో ఉండిపోవడమే. పంచాయతీలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు పొందలేకపోతున్నారు. గ్రామాల్లో ఏ పనులు చేయాలన్నా పన్నులే ఆధారం. దీంతో ఆయా గ్రామాల్లో అభివృద్ధి పూర్తిస్థాయిలో కుంటుపడింది.

- 30 గ్రామాల్లో పాలన పడక
- 2011 నుంచి ఎన్నికల్లేవ్
- ప్రత్యేక పాలనతో ఇబ్బందులే
- అందని ఆర్థిక నిధులు
- పన్నులపైనే ఆధారం
- కుంటుపడిన అభివృద్ధి
- కూటమి రాకతో ఆశలు

మూడుసార్లు ఎన్నికలు జరగలేదు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 1103 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో పాలకుల్లేని పంచాయతీలు 30 ఉన్నాయి. ఆయా పంచాయతీలు 13 ఏళ్లుగా ప్రత్యేక పాలనలోనే ఉన్నాయి. 2006 ఉమ్మడి రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి.ఆ తర్వాత 2011లో ఎన్నికలు జరగాలి.ఆ 30 పంచాయతీల్లో మాత్రం ఎన్నికలు జరగలేదు. 2011 నుంచి ఆ పంచాయతీల్లో సర్పంచ్, పాలకవర్గాలు లేవు. దీంతో ఈ పంచాయతీల్లో ఇప్పటికీ ప్రత్యేకాధికారుల పాలనలోనే ఉన్నాయి. ప్రభుత్వం ఈ పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాలను ఏర్పాటు చేయాలన్న ఆలోచన చేయడంలేదు. ఆయా పంచాయతీల్లో ఎన్నికలపై కొనసాగుతున్న సాంకేతిక, న్యాయపరమైన చిక్కులను తొలగించడం లేదు. దీంతో ఈ గ్రామాల్లో పాలన పడకేసింది. వివిధ శాఖల జిల్లా, మండల అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. స్పెషల్ ఆఫీసర్లు గ్రామాల్లో పర్యటించి సమస్యలను పరిష్కరించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

స్వార్థ రాజకీయాలకు బలి..

మునిసిపాలిటీ, మునిసిపల్ కార్పొరేషన్లలో 30 పంచాయతీలను విలీనం చేయాలని స్థానిక ప్రజలు కోరుకుంటుంటే విలీనం చేస్తే తమ రాజకీయ భవిష్యత్తు ఏంటని ప్రజాప్రతినిధులు, నాయకులు వారి స్వార్థ రాజకీయాల కోసం విలీన ప్రక్రియను అడ్డుకుంటున్నారని విమర్శలున్నాయి. పేరుకే ప్రత్యేకాధికారులైనా అధికార పార్టీ నేతలు, స్థానిక ఎమ్మెల్యే కనుసన్నల్లోనే ఈ గ్రామాల్లో పాలన సాగుతోంది. దీంతో గ్రామాల్లో పాలన అస్తవ్యస్తంగా ఉంది. పాలకవర్గాలు లేకపోవడంతో గ్రామ పంచాయతీలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులకు దూరమవుతున్నాయి. అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి. ప్రజలు చెల్లిస్తున్న పన్నులపైనే అభివృద్ధి పనులు ఆధారపడి ఉన్నాయి. ఈ పంచాయతీల్లో ఎన్నికల సమస్యకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ పరిష్కారం చూపిస్తారని ఆయా గ్రామాల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా తమ గ్రామ పంచాయతీల్లో సాంకేతిక సమస్యలను పరిష్కరించి ఎన్నికలు జరిగేలా చూడాలని వారు కోరుతున్నారు.

ఎన్నికలకు దూరమైన పంచాయతీలివే..

కాకినాడ జిల్లా : కాకినాడ రూరల్ మండల పరిధిలో ఆరు పంచాయతీలు. చీడిగ, రమణయ్యపేట, వలసపాకల, వాకలపూడి, ఇంద్రపాలెం, తూరంగి. తుని మండల పరిధిలో రేకవానిపాలెం, ఎస్.అన్నవరం, తాళ్లూరు, కుమ్మరిలోవ ఉన్నాయి.
తూర్పు గోదావరి జిల్లా : రాజమహేంద్రవరం రూరల్ పరిధిలో ధవళేశ్వరం, బొమ్మూరు, పిడింగొయ్యి, కోలమూరు, శాటిలైట్ సిటీ, కాతేరు, తొర్రేడు, హుకుంపేట, రాజవోలు, వెంకటనగరం.. రాజానగరం మండలంలో నామవరం, వెలుగుబంద, చక్రద్వారబంధం, పాలచర్ల, దివాన్‌చెరువు. కడియం మండలంలో వేమగిరి, కోరుకొండ మండలంలో గాడాల, నిడిగట్ల, మధురపూడి, బూరుగుపూడి పంచాయతీలు ఉన్నాయి.

'గ్రేటర్' రాజమహేంద్రి ఎప్పుడో

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గ్రేటర్ రాజమహేంద్రవరం కలగా మారింది. పరిసర గ్రామాల విలీన ప్రక్రియపై అయోమయం నెలకొంది. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థలో రాజమహేంద్రవరం రూరల్, కోరుకొండ, రాజానగరం మండలంలోని మొత్తం 22 గ్రామాలతో గ్రేటర్ రాజమహేంద్రవరం చేయాలని 2019కి ముందు తెలుగుదేశం ప్రభుత్వం ఆలోచన చేసింది. గ్రామాలను విలీనం చేసి 54 డివిజన్లతో గ్రేటర్ మునిసిపల్ కార్పొరేషన్ మాస్టర్ ప్లాన్ కూడా సిద్ధం చేసింది. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో విలీన ప్రక్రియ మూలనపడింది. కేవలం కొన్ని గ్రామాలనే విలీనం చేసి డివిజన్ల సంఖ్య 54 నుంచి 52కు తగ్గించే ప్రయత్నం చేశారు. అదీ సాగలేదు. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ ఎన్నికలు 2015లో తెలుగుదేశం పార్టీ హయాంలో జరిగాయి. మేయర్‌గా పంతం రజనీ శేషసాయి తెలుగుదేశం పార్టీ తరపున ఎన్నికైన సంగతి తెలిసిందే. ఆ పాలకవర్గం 2019 జూలై 2న ముగిసింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ గెలిచినా ఎన్నికల ఊసే ఎత్తలేదు. ప్రస్తుతం కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికలు జరిపిస్తారనే ప్రచారం జరుగుతోంది. విలీనం గ్రామాలతో కలిపి ఎన్నికలు జరపాలని కొందరు, పాత 50 డివిజన్లతోనే ఎన్నికలు జరిపితే బావుంటుందని కొందరు ఆలోచిస్తున్నట్టు సమాచారం. కానీ ప్రజలు మాత్రం గతంలో ప్రతిపాదించిన 22 గ్రామాలను కలిపి ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్నారు. అలా జరిగితేనే వచ్చే పుష్కరాల నాటికి గ్రేటర్ రాజమహేంద్రవరం కల నెరవేరుతుందనే చర్చ మొదలైంది. ప్రస్తుతం తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ గ్రేటర్ కలలు కంటున్నారు. కొద్దిరోజుల కిందట సీఎం చంద్రబాబు వద్ద పలువురు ఎమ్మెల్యేలు గ్రామాల విలీనం, ఎన్నికల గురించి ప్రస్తావించినట్టు సమాచారం.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

రాజమహేంద్రవరం రూరల్ నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు డివిజన్, మండల స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమం సోమవారం యథాతథంగా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ ,ఇతర జిల్లా అధికారులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఫిర్యాదులను కలెక్టరేట్‌లో ప్రజల నుంచి స్వీకరిస్తారని తెలిపారు. రెవెన్యూ, మునిసిపల్ ,మండల స్థాయి అధికారులు అందరూ మండల ప్రధాన కేంద్రంలో ఒకే చోట హాజరై అర్జీలు స్వీకరించాలని ఆదేశించారు.



కరుణించమ్మా.. కోటసత్తెమ్మ

నిడదవోలు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో ఆదివారం అమ్మ వారికి విశేష పూజలు చేశారు.అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి క్షీర నివేదన మహా నివేదన చేశారు. తూర్పు గోదావరి జిల్లా నుంచి మాత్రమే కాక రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



మస్తర్ల మాయాజాలం!

గ్రామంలో లేకున్నా పనులకు వచ్చినట్టు మస్తర్లు

- ఉపాధిలో భారీ అవినీతి
- దొంగ మస్తర్లతో మస్కా
- కోట్లాది రూపాయలు స్వాహా
- అక్రమార్జనలో ఫీల్డ్ అసిస్టెంట్లు
- ముక్కినాడలో ఇదీ తీరు

రాజానగరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం కొంతమంది అవినీతి పరులకు వరంగా మారింది.గ్రామాంతరం వెళ్లిన వారితో పాటుగా, గ్రామంలో ఉంటూ అసలు ఉపాధి హామీ పనులకు రాని వారికి సైతం జాబ్ కార్డులు సృష్టించి పనుల్లోకి వస్తున్నట్లుగా మస్తర్లు వేస్తూ, కోట్లాది రూపాయల ప్రభుత్వ నిధులను స్వాహా చేస్తున్నారు. దొంగ మస్తర్లతో అధికారులను మస్కా కొడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమార్జనకు పాల్పడుతున్నారు. దీంతో ఉపాధి హామీ పథకంలో పనులు చేయకుండా వేతనాలు తీసుకునే కూలీల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతోంది. రాజానగరం మండలం ముక్కినాడ గ్రామంలో సాగుతున్న ఉపాధిహామీ పనులే ఇందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. గ్రామంలో గత వైసీపీ ప్రభుత్వ పాలన నాటి నుంచి నేటి వరకు కోట్లాది రూపాయలు వెచ్చించి ఉపాధి పనులు చేపట్టినట్లుగా రికార్డులను బట్టి తెలుస్తోంది. కానీ వాస్తవంగా పరిశీలిస్తే వీరిలో అధికశాతం పనిలోకి రానివారికి మస్తర్లు వేస్తూ.. వేతనాలు డ్రా చేసి, వారికి కొంత ముట్టజెప్పి, మిగిలిన సొమ్మును ఫీల్డ్ అసిస్టెంట్ కాజేస్తున్నట్టు సమాచారం. రాజమహేంద్రవరపు సోమరాజు, భార్య సత్యవేణి జాబ్ కార్డు నెంబర్ (ఏపీ-04-028-018-012/010024) గత కొన్నేళ్లుగా రాజమహేంద్రవరంలో నివసిస్తూ, ఒక అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. వీరు గత ప్రభుత్వ హయాం నుంచి ఇప్పటి వరకు ముక్కినాడలో చేపట్టే ఉపాధి పనులకు వెళుతున్నట్టుగా మస్తర్లు నమోదు చేసి డబ్బులు కాజేస్తున్నారు. అలాగే సోడసాని నాగరాజు జాబ్ కార్డు నెంబర్ (ఏపీ-04-028-018-012/010492); ఉండమట్ల రాజు జాబ్ కార్డు నెం.(ఏపీ/010305); కవల శివరామ్ జాబ్ కార్డు నెం.(ఏపీ/010097); చిర్ల రామకృష్ణారెడ్డి జాబ్ కార్డు నెం.(ఏపీ/010497) అనే వారు ఇంత వరకు అసలు ఉపాధి పనిలోకి వెళ్లిన దాఖలాలు లేవు.. అయినా వీరంతా ఉపాధి పనులకు వస్తున్నట్టుగా మస్తర్లు నమోదు చేసి వేతనాలు డ్రా చేస్తున్నట్టుగా ఆధారాలు రుజువు చేస్తున్నాయి. ఈ విధంగా ఎంతో మందికి దొంగ మస్తర్లు చూపిస్తూ, కోట్లాది రూపాయల ప్రభుత్వ నిధులు దోపిడీకు గురవుతున్నట్లు తెలుస్తోంది. ఈ విధంగా నరేంద్రపురం గ్రామంలో కూడా కోట్లాది రూపాయల ఉపాధి నిధులు పక్కదారి పట్టాయని, విచారణ జరిపించాలని కోరుతూ ఇటీవల గ్రామ సభలో గ్రామస్తులు అధికారులకు మొరపెట్టుకున్నారు. అయితే నేటికి అధికారులు ఏవిధమైన విచారణ చేపట్టలేదు. కొంతమంది రాజకీయ నాయకుల పలుకుబడిని ఉపయోగించి ఈ అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నారని సమాచారం. ఉపాధి హామీ పనుల్లో చోటు చేసుకుంటున్న అవినీతి అక్రమాలను వెలికితీయాలని ముక్కినాడ వాసులు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.



ముక్కామల సభలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్.. (ఇన్‌సెట్‌లో) రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న దుర్గేష్, శేషారావు

గుంతల్లేని రహదారులే లక్ష్యం

ముక్కామలలో రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించిన మంత్రి దుర్గేష్

పెరవలి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రూ.826 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా రహదారుల మరమ్మతులు చేసేందుకు దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించినట్టు మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పెరవలి మండలం ముక్కామలలో గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వం కొత్త రోడ్లు వేయడం మాట ఎలా ఉన్నా ఉన్న రహ దారులను బాగు చేయాలన్న ఆలోచన కూడా చేయలేదన్నారు.గత ఐదేళ్లలో రాష్ట్రంలో రోడ్లన్నీ నరకానికి చిరునామాగా మారాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎన్‌టీఆర్ పింఛన్లు క్రమం తప్ప కుండా ఒకటో తేదీన లబ్ధిదారులకు అం దజేయడం జరుగుతుందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏపీని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ గుంతలు లేని రహదారులుగా రోడ్లను మార్చడానికి ప్రణాళిక రూపొందించామన్నారు. నిడదవోలు నియోజకవర్గంలో సుమారు రూ.79 లక్షలతో పనులు చేపడుతున్నామన్నారు. రాబోయే సంక్రాంతి నాటికి గుంతలు లేని రహదారులను రూపొందించడమే లక్ష్యంగా పనులు చేస్తున్నారని తెలిపారు.మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ గుంతలు లేని రహదారుల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఇంజనీర్ ఎస్‌బీవీ రెడ్డి, డీఈ వెంకట రమణ, ఏఈ శ్రీనివాస్, నాయకులు భూపతిరాజు రవి వర్మ, సర్పంచ్ కేతా త్రిమూర్తులు,వైస్ సర్పంచ్ వీరేష్ బాబు, అతికాల రామకృష్ణమ్మ, పిప్పర రవి, వేండ్ర వెంకట రామమూర్తి, రేలంగి రాజేష్, నల్ల సురేంద్ర, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గోనె సంచులు వచ్చేశాయ్..



గోపాలపురం సచివాలయం-2 వద్ద లారీ నుంచి దిగుమతి అవుతున్న గోనె సంచులు

గోపాలపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈ ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం రైతులకు అవసరమైన గోనె సంచులు ఆదివారం మండల కేంద్రానికి వచ్చేశాయి. మండలంలో మొత్తం 3,73,000 సంచులు కావాల్సి ఉండగా వాటిలో ప్రస్తుతం 40 వేల సంచులు మండల కేంద్రానికి చేరుకున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరికోతలు ప్రారంభించకుండానే వ్యవసాయ అధికా రులు గోనె సంచులను అందుబాటులో ఉంచారు.

పోలీసు డాగ్‌తో చోరీ స్థలం పరిశీలన

గోపాలపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాగిపాడు గ్రామంలో శనివారం రాత్రి బమిడిపాటి శ్రీనివాస్ ఇంట్లో చోరి జరిగిన విషయం తెలిసిందే. చోరికి కారణమైన దుండగులను గుర్తించేందుకు రాజమహేంద్రవరం నుంచి డాగ్‌స్క్వాడ్ వచ్చినప్పటికీ ఫలితం దక్క లేదు. దీంతో వేలిముద్రల నిపుణులు పలు ఆధారాలు సేకరించారు. సీఐ బీ.నాగేశ్వరరావు నాయక్ ఆధ్వర్యంలో ముగ్గురు ఎస్ఐలు, ఏడు బృందాలతో అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు. సాగిపాడు పెట్రోలు బంకు మొదలుకుని దొండపూడి సెంటర్ వరకు ఉన్న సీసీ టీవీ ఫుటేజీలు పరిశీలించారు. సీఐ నాగేశ్వరరావు నాయక్ మాట్లాడుతూ బమిడిశెట్టి శ్రీనివాస్ ఇంట్లో జరిగిన చోరి ఘటనను పరిశీలించినట్లు తెలిపారు. ఈ పరిశీలనలో 40 కాసుల బంగారంతో పాటు రూ.6లక్షల నగదు, అపహరణకు గురైనట్లు నిర్ధారించామన్నారు. ఒక్కొక్క బృందంలో నలుగురు చొప్పున ఏడు బృందాలు ఏర్పాటు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



సాగిపాడులో చోరి జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసు డాగ్



దేవరపల్లి నుంచి సైకిల్‌పై శబరిమల యాత్రకు బయలుదేరుతున్న స్వాములు

సైకిల్‌పై శబరిమల యాత్రకు పయనం

దేవర పల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు అయ్యప్ప స్వామి భక్తులు కామిశెట్టి వెంకటరమణ, చింతాడ డేవిడ్ ఆదివారం దేవరపల్లి నుంచి శబరిమల అయ్యప్పస్వామి దర్శనానికి సైకిల్‌పై బయలుదేరారు. సైకిల్‌పై శబరిమల వస్తానని మొక్కుకోవడంతో ఈ యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. వారికి బంధువులు, అయ్యప్పస్వామి గురువు రమణ తదితరులు యాత్రను ప్రారంభించారు.

అవినీతి నిర్మూలనతోనే అభివృద్ధి సాధ్యం

పెరవలి, నవంబరు 3(ఆంధ్ర జ్యోతి): అవినీతి నిర్మూలన ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమని తణుకు ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్ కెఎస్ రాజశేకర్ అన్నారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగం గా ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విజిలెన్స్ వారోత్స వాలు అక్టోబరు 28 నుం చి నవంబరు 3 వరకు జరుపుతున్నామన్నారు. దీనిలో భాగంగా ముక్కామలలో సదస్సు నిర్వ హిస్తున్నామన్నారు. నిజాయితీ ద్వారానే దేశం పురోగతి సాధ్యమన్నారు. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు, కవికొండల వెంకటేశ్వర్లు, బోళ్ళ మంగారావు, సలాది భాస్కరరావు, శ్రీనివాస్, వెంకట రత్నారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

కారు ఢీకొని వ్యక్తి మృతి

● మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

● దేచర్ల వద్ద ఘటన



మృతుడు మాణిక్యాలరావు



ప్రమాదంలో గాయపడిన గోవిందరాజులు

కొవ్వూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. రాజమహేంద్రవరం సీతంపేట గ్రామానికి చెందిన వాడపల్లి మాణిక్యాలరావు(60), కడియం గోవిందరాజులు, కడియం సుధీర్‌లు కలిసి స్కూటీపై కొవ్వూరు మండలం పంగిడి బయలుదేరారు. ఎక్స్‌ప్రెస్ హైవేపై సర్వీసు రోడ్డును దాటి ముందుకు వెళ్లిపోయారు. దేచర్ల గ్రామ శివారులో పంగిడి దాటిపోయామని గమనించి స్కూటీని సడన్‌గా కుడివైపునకు తిప్పుతుండగా వెనుక వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మాణిక్యాలరావు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందగా గోవిందరాజులు, ఆయన మనుమడు సుధీర్‌లకు గాయాలు కావడంతో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆపై అత్యవసర వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. సమాచారం తెలుసుకున్న కొవ్వూరు రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు. కాగా మాణిక్యాలరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. అందరికీ వివాహాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న కుమారుడు చెన్నై నుంచి బయలుదేరినట్టు సమాచారం.

వాటర్ ట్యాంక్‌కు మరమ్మతులు

గోపాలపురం, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): ఈ నీరు తాగితే రావా రోగాలు కథనంతో అధికార యంత్రాంగంలో గుబులు మొదలైంది. పెద్దగూడెం 16వ వార్డులో ఉన్న శ్రీసత్యసాయి మంచినీటి ట్యాంకు మరమ్మతులకు గురైంది. దీంతో ఆంధ్రజ్యోతి కథనంతో అప్రమత్త మైన అధికారులు సత్యసాయి మంచినీటి ట్యాంకు వద్ద నీరుపట్టి కెళ్ళేందుకు అసౌకర్యంగా ఉండి మరమ్మతులకు గురైన ట్యాంకు ప్రదేశాన్ని మరమ్మతులు చేయించారు.



పెద్దగూడెం సత్యసాయి వాటర్ ట్యాంకు వద్ద మరమ్మతులు చేసిన దృశ్యం

యాదవ సంఘం కార్యవర్గం ఎన్నిక



నిడదవోలులో ఎన్నికైన యాదవ సంఘం కార్యవర్గం

నిడదవోలు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యాదవుల వీధిలోనున్న మదన గోపాలస్వామి ఆలయంలో ఆదివారం యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా తీర్దాల రామచంద్రారావు, అధ్యక్షులుగా గాలి బంగారయ్య, కార్యదర్శిగా గుడ్ల వెంకట నారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షులుగా కండే గురునాథం, కోశాధికారిగా నాగళ్ళ బాలాజీ, లీగల్ అడ్వైజర్‌గా ఆదూరి విశ్వనాద్, సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా పట్టపగలు ప్రసాద్ తదితర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో అక్కాచెల్లెళ్లు మృతి

» నిద్రమత్తులో లారీని ఢీకొట్టిన కారుడ్రైవర్

» మృతులు అనంతపురం జిల్లా వాసులు





పుల్లలపాడు వద్ద లారీని ఢీకొన్న కారు, చికిత్స పొందుతున్న డ్రైవర్ సూర్యనారాయణ

ఏలూరు క్రైం/నల్లజర్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని నిద్రమత్తులో ఉన్న కారు డ్రైవర్ ఢీ కొనడంతో అక్కాచెల్లెళ్ళు మృతి చెందగా డ్రైవర్ తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ సంఘటన తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పుల్లలపాడు గ్రామ సమీపంలో ఆదివారం ఉదయం 5.30 గంటలకు జరిగింది. అనంతపురంనకు చెందిన అనంతపురంలోని శ్రీసత్యసాయి విద్యాసంస్థలలో ప్రొఫెసర్‌గా పనిచేసి పదవీ విరమణ చెందిన కనకదుర్గ (84) వివాహం కాలేదు. ఆమె సోదరి రాజేశ్వరి (87)తో కలిసి ఉంటున్నారు. రాజేశ్వరికి కూడా వివాహం కాలేదు. అనంతపురంలోని శారదా కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరిద్దరికి సంబంధించిన ఆస్తులు కాకినాడలో ఉన్నాయి. మూడు నెలలకు ఒకసారి వెళ్లి అద్దె సొమ్ములను వసూలు చేసుకుని వస్తూ ఉంటారు. దీనిలో భాగంగా అద్దె సొమ్ము వసూలు చేసుకోవడానికి వారివద్ద డ్రైవర్‌గా పనిచేసే అనంతపురం జిల్లా రాప్తాడు మండలం రామనేపల్లి గ్రామానికి చెందిన సాకే సూర్యనారాయణ (45) ఈ నెల 2వ తేదీ సాయంత్రం 5 గంటలకు అనంతపురం నుంచి కాకినాడకు కారులో వీరిద్దరు బయలు దేరారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో విజయవాడ దాటిన తరువాత ఓ పెట్రోల్ బంక్ వద్ద కారు పక్కన పెట్టి నిద్రించారు. తిరిగి 4.30 గంటలకు బయలుదేరారు. మార్గమధ్యలో నల్లజర్ల మండలం పుల్లలపాడు వద్ద జాతీయ రహదారిపై ఎలాంటి సిగ్నల్స్ లేకుండా ఒక లారీ ఆగి ఉంది. దీంతో దానిని గమనించక డ్రైవర్ కారుతో ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో కనకదుర్గ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్ర గాయాలపాలైన రాజేశ్వరి, సూర్యనారాయణలను ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి వచ్చిన కొద్ది సేపటికే రాజేశ్వరి మృతిచెందింది. ఆస్పత్రి ఐసీయూలో సూర్యనారాయణ చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై నల్లజర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. బంధువులకు పోలీసులు సమాచారం ఇచ్చారు.



రాజేశ్వరి, కనకదుర్గ(ఫైల్ ఫొటోలు)

ఓటు నమోదు 6తో ముగింపు

ఉండ్రాజవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం పట్టభద్రులు ఓటు నమోదుకు ఈనెల 6వ తేదీ వరకు గడువు ఉందని తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ తెలిపారు. ఓటు నమోదు చేసుకొనేందుకు సంబంధిత ధ్రువపత్రాలతో ఆయా గ్రామ సచివాలయాల్లో గాని, తహశీల్దార్ కార్యాలయంలో గాని 6వ తేదీ లోగా అందజేయాలని చెప్పారు.

ఎస్‌సీ రైల్వే స్కౌట్స్ అండ్ గైడ్స్ డైమండ్ జూబ్లీ



రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సౌత్ సెంట్రల్ రైల్వే భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాజమండ్రి విభాగం స్కౌట్ గైడ్ వీక్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ వార్షికోత్సవంలో భాగంగా రాజరాజ నరేంద్ర, గోదావరి ఓపెన్ గ్రూప్ ముఖ్య అతిథిగా బి.సైదయ్య ఐపీఎఫ్(ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ప్రొటెక్షన్ ఫోర్స్), ఆర్‌పీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీ వరలక్ష్మి, ఇతర సిబ్బంది రైల్వే స్కౌట్ డెన్ ఆవరణలో ఆదివారం కబ్స్, బుల్బుల్స్, స్కౌట్స్, గైడ్స్, రోవర్స్, రేంజర్స్ మొక్కలు నాటారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ దేశమంతటా స్కౌట్స్ అండ్ గైడ్స్ వీక్‌ను జరుపుకుంటూ సమాజానికి ఎంతో మేలు చేస్తున్నారని సైదయ్య తెలిపారు. అనంతరం వరలక్ష్మి మాట్లాడుతూ సమాజసేవలో ముందంజలో ఉండాలన్నారు. కార్యక్రమ నిర్వహణకు రేంజర్ ఎస్.ఐంద్రి, రోవర్ బి.నూకరాజు, పి.శ్యామ్, స్కౌట్ కె.కౌశిక్ సహకారం అందించారు.



దేవరపల్లి సాయిబాబా ఆలయంలో కార్తీకదీపాలు వెలిగిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో కార్తీకదీపాలు

దేవరపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి షిర్డీసాయిబాబా ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా కార్తీకదీపార్చన ఆదివారం సాయంత్రం జరిపారు. కార్యక్రమంలో దేవరపల్లి గ్రామానికి చెందిన గుడ్ల వెంకటేశ్వరరావు, కనకదుర్గ దంపతులు, జుత్తిగ సత్తిబాబు, వీరలక్ష్మి దంపతులు శివలింగం ఆకారంలో ఏర్పాటు చేసిన 108 కార్తీక దీపాలను వెలిగించారు. ఆలయ అర్చకుడు సత్య నారాయణ ఆచార్యులు మాట్లాడుతూ కార్తీక మాసం ప్రారంభం నుంచి ప్రతిరోజు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు జరిపి, సాయంత్రం దీపార్చనలు నిర్వహిస్తామన్నారు.

కాంగ్రెస్ పార్టీ నిడదవోలు ఇన్‌చార్జిగా వెంకటేశ్వరరావు



నిడదవోలు, నవంబరు 3(ఆంధ్ర జ్యోతి): పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కారింకి వెంకటేశ్వరరావు నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్రాధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్టు జిల్లా అధ్య క్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

12 టీబీ ముక్త పంచాయతీలు

సీతానగరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): టీబీ ముక్త పంచాయతీలుగా మండలంలోని 12 పంచాయతీలను గుర్తించినట్టు సీతానగరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఏవీకె చైతన్య తెలిపారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ టీబీ ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా 2023లో టీబీ వ్యాధి నిర్మూలనకు విశేష కృషి చేసిన సీతానగరం, సింగవరం, పురుషోత్తపట్నం, చీపురుపల్లి, ముగ్గళ్ల, కూనవరం, వెదుళ్లపల్లి, కాటవరం, జాలిమూడి, ము నికూడలి, ములకల్లంక, మిర్తిపాడు పంచాయతీలను టీబీ ముక్త పంచాయతీలుగా గుర్తించినట్టు చెప్పారు. ఈ 12 పంచాయతీల కార్యదర్శులు శనివారం కలెక్టర్ చేతుల మీదుగా కాంస్య పతకాలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారన్నారు.

నేత్రపర్వంగా అయ్యప్ప పడిపూజ



రాజానగరంలో కలశాలతో మహిళల గ్రామోత్సవం

రాజానగరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాజానగరంలో అయ్యప్ప పడిపూజ ఆదివారం నేత్రపర్వంగా జరిగింది. దీనిలో భాగంగా తొలుత తెల్లవారు జామున స్థానిక వినాయక గుడి ప్రాంగణంలో గణపతి హోమం నిర్వహించారు. అనంతరం రథయాత్రలో అయ్యప్ప భక్తులు, మహిళా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి గ్రామోత్సవం చేపట్టారు. సాయంత్రం అయ్యప్ప పడిపూజ వైభవంగా జరిపించారు. స్థానిక, పరిసర గ్రామాల అయ్యప్ప, శివ మాల ధారులు పాల్గొని పూజాకార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ ప్రవ చకర్త రాధామనోహర్ దాస్ ముఖ్యఅతి థిగా విచ్చేసి రామాయణం, మహాభారతంలోని పలు ఘట్టాలను వివరిస్తూ, భక్తి గీతాలను ఆలపించారు. ఎవరైనా మనకు నమస్కారం చేసినా, దణ్ణం పెట్టినా మనలోని పరమాత్మకు పెట్టినట్టుగా భావించాలని ప్రవచించారు. వినయంతో ఉండాలని, ధర్మాన్ని విడిచిపెట్టరాదని ప్రబోధించారు.

రంగంపేట: రంగంపేటలో శ్రీమణికంఠ క్షేత్రం వద్ద చొల్లంగి అర్జునరావు గురుస్వామి ఆధ్వ ర్యంలో నిర్వ హించిన స్వామిఅయ్యప్ప లక్ష బిల్వార్చన, పడిపూజ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్జునరావు సేవలను ప్రశంసించి సత్కరించారు. అనంతరం ఆయన స్వామి విగ్రహానికి పూజలు నిర్వహించగా అర్చకులు వేద ఆశీర్వాదం చేశారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా నరసరాపేటకు చెందిన దప్పు శ్రీనుస్వామి కళాబృందం ఆలపించిన సంకీర్తనలు అలరించాయి. అంతకు ముందు స్వాములు కాగడ హారతితో గ్రామంలో ఊరేగారు.

అనపర్తిలో పేటతుళ్లి

అనపర్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అనపర్తి కెనాల్ రోడ్డులో అయ్యప్పస్వామికి దీక్షాధారులు పేటతుళ్లి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవ విగ్రహంతో భక్తులు గ్రామ వీధుల్లో శోభాయాత్ర జరిపారు. మాలలు ధరించిన 500మంది భక్తులు పాల్గొన్నారు.



అనపర్తిలో పేటతుళ్లి నిర్వహిస్తున్న అయ్యప్ప దీక్షాదారులు

ఎక్సైజ్ దాడుల్లో ఇద్దరి అరెస్టు

కొవ్వూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి 115 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. తాళ్ళపూడి మండలం తాడిపూడి గ్రామంలో ఎక్సైజ్ సీఐ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం రాత్రి దాడి చేశారు. ఈ దాడుల్లో తాడిపూడికి చెందిన కేతా రాంబాబు, తుపాకులగూడెం గ్రామానికి చెందిన రాయుడు దానయ్యలను అరెస్టులు చేసి వారి నుంచి 115 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. ఈ దాడులలో సీఐ హనుశ్రీ, రాజమహేంద్రవరం, కొవ్వూరు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న నాటుసారా

ఉండ్రాజవరంలో ఏకాదశ సహస్ర గళార్చన



ఏకాదశ సహస్ర గళార్చన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఉండ్రాజవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పెరవలి మండలానికి చెందిన హిందూ ధర్మ పరిరక్షణ సేవాసమితి ఆధ్వర్యంలో ఉండ్రాజవరంలో ఆదివారం ఏకాదశ సహస్ర గళార్చన, హనుమాన్ చాలీసా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 1008మంది చిన్నారులతో 11 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. అనంతరం జ్యోశ్యుల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గణపతి పూజ, ఆంజనేయ స్వామి అష్టోత్తర పూజ జరిపారు. కార్యక్రమ సమన్వయకర్త సీహెచ్‌ఎస్ నాగభూషణం మాట్లాడుతూ నేటితరం చిన్నారులకు సనాతన సంప్రదాయాలను పరిచయం చేయడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సుంకవల్లి సూర్యానారాయణ, జీవీ సుబ్రహ్మణ్యం, కుదప చక్రపాణి, సుంకవల్లి వెంకటేశ్వర్లు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు బుక్స్ ఆఫ్ రికార్డ్స్‌లో కైవల్యారెడ్డికి చోటు

నిడదవోలు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన విద్యార్థిని కుంచాల కైవల్యారెడ్డికి తెలుగు బుక్స్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కడంపై పలువురు అభినందించారు. చిత్రలేఖనం, సైన్స్, కరాటే, నృత్యం, సాంస్కృతిక రంగాలలో అనేక రివార్డులు సాధించారు. తెలుగు బుక్స్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకోవడంతో తాడేపల్లిగూడెంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల తెలుగు బుక్స్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి సిరిమువ్వల శ్రీనివాస్ నుంచి అవార్డు అందుకోవడంపై పలువురు విద్యార్థిని అభినందించారు.

హరికృష్ణకు సన్మానం



గన్నమని హరికృష్ణను సన్మానిస్తున్న సిరిమువ్వ కమిటీ సభ్యులు

దేవరపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు విశిష్ట సేవారత్న అవార్డును దేవరపల్లికి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు గన్నమని హరికృష్ణకు అందజేశారు. ఆదివారం తాడేపల్లిగూడెంలో గమిని ఫంక్షన్ హాలులో సిరిమువ్వ సేవా సంస్థ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు విశిష్ట సేవా అవార్డును హరికృష్ణకు సంస్థ అధ్యక్షుడు గమిని సుబ్బారావు, గౌరవాధ్యక్షులు గ్రంధి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు శ్రీకాకుళపు కాళీకృష్ణ ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమంలో దేవరపల్లికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు యాగంటి వెంకటేశ్వరరావు, ఉప్పులూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వివాహితపై హత్యాచారం దారుణం

» ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోపీశ్రీనివాస్

» బాధిత కుటుంబానికి బీజేపీ, సీపీఎం, ప్రజాసంఘాల పరామర్శ.. ఆదుకోవాలని వినతి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

కడియం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గంజాయి మత్తులో వివాహితపై హత్యాచారానికి పాల్పడడం దారుణమని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రొంగల గోపీశ్రీనివాస్ అన్నారు. మండలంలోని బుర్రిలంకలో హత్యాచార బాధిత కుటుంబాన్ని బీజేపీ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కూలీలకు, యువతకు గంజాయి ఎలా లభిస్తోందో రాష్ట్ర ప్రభుత్వం ఆరా తీయాలని, పోలీసు అధికారులు గంజాయిపై నిఘా పెంచాలన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలన్నారు. ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ ఆకుల శ్రీధర్, యానాపు ఏసు, నాగులపల్లి వీరబాబు, కరుటూరి శ్రీనివాస్, కొటికలపూడి వెంకటేశ్వరరావు, బొర్సు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మహిళా కూలీలకు భద్రత కల్పించాలి

నర్సరీల్లో పనిచేసే మహిళా కూలీలకు భద్రత కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. హత్యాచార బాధిత కుటుంబాన్ని అరుణ్‌తోపాటు ఐద్వా జిల్లా కార్యదర్శి పి.తులసి, ఉపాధ్యక్షురాలు స్రవంతి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.అరుణకుమారి, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వై.బేబీ రాణి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ మూర్తి, సీపీఎం, యూటీఎఫ్ నాయకులు పి.మురళి, చిలుకూరి శ్రీనివాసరావు పరామర్శించారు. సంఘటన వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, డీఎస్పీతోను ఫోనులో మాట్లాడారు. నిందితులకు కఠినంగా శిక్ష పడేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి సీఎం సహాయనిధి నుంచి రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, ఇల్లు మంజూరు చేయాలని, మానసిక దివ్యాంగురాలైన చిన్నారికి పెన్షన్ ఇవ్వాలని, కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళ పనిచేసే నర్సరీ యాజమాన్యం, నర్సరీ అసోసియేషన్ ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

నటించే వారు ఉన్నంత కాలం కష్టపడే వారికి అన్యాయమే

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పార్టీ అధిష్టానం వద్ద నటించే వారు ఉన్నంతకాలం కష్టపడి పనిచేసే వారికి అన్యాయమే జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాలేపల్లి మురళీధర్‌రావు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌లో ఆది నుంచి పనిచేస్తున్నామని, ప్రతి ఐదునెలలకు పార్టీ అధి నాయకత్వం రాష్ట్రంలో అధ్యక్షులను మార్చడం, దానికి అనుగుణంగా కొత్త కమిటీలు వస్తున్నాయని, కష్టపడి పనిచేసే వారిని పక్కనపెడుతున్నారన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ స్క్రీన్1	: అమరన్
వై.స్క్రీన్2 : లక్కీ భాస్కర్	
దేవిశ్రీ(గాయత్రి	: క
అనన్య	: భఘీర

నిడదవోలు

వీ మ్యాక్స్	: లక్కీ భాస్కర్
రాధాకృష్ణ	: వెనం
శ్రీగణపతి	: అమరన్

దేవరపల్లి

శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	: దేవర
త్రినాథ్ సినీ మ్యాక్స్	: దేవర